నేటి కందం- నేటికి అందం



కారావాసము చేసిన
వారందరు యనుభవించు పదవుల నెల్లన్
తీరుగ రద్దానరించెడి
భారీ సవరణను ప్రభుత ప్రతిపాదించెన్ !!

(జైలు కు వెళ్ళిన నేతల పదవులు రద్దయ్యే విధంగా 130 వ రాజ్యాంగ సవరణను మోడి ప్రభుత్వం ప్రవేశపెట్టింది)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

చురక

మంత్రులను తొలిగించే
మర్మంతో కొత్త బిల్లు
పాసైతే పడుతుందిక
ప్రజాస్వామ్య భవిత చిల్లు
పదవి నేతలపై కేసులు
పెట్టి జైల్లో నొక్కేస్తరు
అనర్హంగా మార్చివేసి
అట్టడుగున తొక్కేస్తరు

-వేల్పుల నారాయణ
9440433475



website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 26-8-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :32 సంచిక:20 పేజీలు:6 వెల: రూ.1/-


## మానవ మృగాలు ఫామ్ హౌస్‌లో ఉన్నాయి..సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఆగష్టు 25:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్, కేటీఆర్‌లపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో మానవ మృగాలు ఫామ్ హౌస్‌లో ఉన్నాయని, వారి పాలన, ప్రవర్తనను తీవ్రంగా విమర్శించారు.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి . మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్‌లపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మానవ మృగాలు ఫామ్ హౌస్‌లో ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి, అక్రమ లావాదేవీలు జరిగాయని, ఫామ్ హౌస్‌లు అవినీతి కేంద్రాలుగా మారాయని ఆరోపించారు.

ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోకుండా వ్యక్తిగత స్వార్థ లాభాలకు ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. తమ ప్రభుత్వం పారదర్శకంగా, నిజాయితీగా పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## తెలంగాణలో రెండురోజులు భారీ వానలు.. హెచ్చరించిన ఐఎండీ

హైదరాబాద్, ఆగష్టు 25: తెలంగాణలో రాగల నాలుగు రోజులు రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలుంటాయని తెలిపింది.

బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. గురువారం ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలుంటాయని పేర్కొంది. శుక్రవారం ఆసిఫాబాద్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వివరించింది. ఈ క్రమంలో వాతావరణశాఖ వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

## ఖైరతాబాద్ మహాగణపతి ఆగమన్ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా మహారాష్ట్ర బ్యాండ్

హైదరాబాద్, ఆగష్టు 25: ఖైరతాబాద్ మహాగణపతి ఆగమన్ కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా మహారాష్ట్ర బ్యాండ్ నిలిచింది. ఇంతకాలం ఎంతో అపురూపంగా తయారైన ఖైరతాబాద్ గణేశుడు ఇవాళ భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ ఆగమన్ కార్యక్రమాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వాహకులు జరిపించారు.

గణపతికి ఒక వైపు పూరి జగన్నాధుడు, సుభద్ర, బలరాముడు సహ లక్ష్మీ సమేత హయగ్రీవస్వామి..కొలువుతీరగా, మరోవైపు ఖైరతాబాద్ గ్రామ దేవత గజ్జల అమ్మవారు ఉన్నారు. ఇప్పటికే ఖైరతాబాద్ వినాయకుడి దగ్గరకు సందర్శకులు పెద్ద ఎత్తున వస్తున్నారు. ఇప్పుడు ఆగమన్ జరగడంతో ఇక భక్తుల తాకిడి తీవ్రమైంది.

దాదాపు తొమ్మిది రోజుల పాటు ఖైరతాబాద్ మహా గణపతి దగ్గర తొమ్మిది రకాల హోమాలు చేస్తారు. అదే విధంగా కాశీ నుంచి లక్ష రుద్రాక్షలు తీసుకొచ్చి గణపతి మెడలో వేస్తారు. దాంతోపాటు వినాయకుడికి కళ్యాణం ఉంటుంది. వినాయక చవితి రోజున వినాయకుడికి కళ్యాణం ఉంటుంది.

వినాయక చవితి రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు



ఇటు గవర్నర్ కూడా హాజరవుతారు. ఈ ఏడాది గణేశుడికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కళాకారులు 20 మంది రంగులద్దగా, తమిళనాడుకు చెందిన కళాకారులు విగ్రహాన్ని రూపొందించారు.

## రాష్ట్ర రైతాంగానికి మంత్రి తుమ్మల బహిరంగ లేఖ..

హైదరాబాద్, ఆగష్టు 25: తెలంగాణ రైతాంగానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బహిరంగ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థత కారణంగానే రాష్ట్రంలో యురియా కొరత ఏర్పడిందంటూ లేఖలో తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రానికి రావాల్సిన యూరియా సరఫరాలో కేంద్రం ఘోరంగా విఫలమైందని లేఖలో ఆరోపించారాయన.

'కేంద్ర ప్రభుత్వ అసమర్థతతో దిగుమతి యూరియా రాలేదు. రాష్ట్రానికి రావాల్సిన యూరియా సరఫరాలో ఘోర వైఫల్యం చెందింది. రైతులకు ఇప్పటివరకు 7.32 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశాం. ఆగస్టు వరకు రాష్ట్రానికి 3.94 లక్షల మెట్రిక్ టన్నుల దిగుమతి యూరియా కేటాయించారు. అందులో కేవలం 2.10 లక్షల మెట్రిక్ టన్నులే సరఫరా చేయడం జరిగింది. ఖీఈఅఒ లో 78 రోజులు ఉత్పత్తి నిలిచిపోవడంతో యూరియా రాలేదు. రాష్ట్రానికి 1.69 లక్షల మెట్రిక్ టన్నుల కేటాయింపులో 1.07 లక్షలే సరఫరా చేశారు. మొత్తం 2.58 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా లోటు ఏర్పడింది. కేంద్ర వైఫల్యాన్ని రాష్ట్రంపై నెట్టాలని చూస్తున్నారు. దేశవ్యాప్తంగా యూరియా కొరత ఉంది. కానీ, తెలంగాణలో మాత్రమే యూరియా కొరత ఉన్నట్లు బీజేపీ నేతలు అబద్ధాలు చెబుతున్నారు.' అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన లేఖలో ఆరోపించారు.

### రైతుల ముసుగులో ఆందోళనలు..

'రైతుల ముసుగులో బీఆర్ఎస్ ప్రేరేపిత ఆందోళనలు చేస్తున్నారు. యూరియా క్యూలైన్లపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం జరుగుతోంది. నానో యూరియా వినియోగం పెంచితే రైతులకు మేలు జరుగుతుంది. కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గించాలని కేంద్రానికి డిమాండ్ చేస్తున్నాం. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతులకు భరోసా కల్పిస్తాం. రాష్ట్రానికి రావాల్సిన యూరియా తెప్పించేందుకు ఎంతవరకైనా పోరాడతాం.' అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన లేఖలో పేర్కొన్నారు.

## ప్రధాని విద్యా రికార్డును బహిర్గతం చేయరు: ఢిల్లీ హైకోర్టు తీర్పు

న్యూఢిల్లీ, ఆగష్టు 25:ప్రధాని నరేంద్ర మోదీ బ్యాచిలర్ డిగ్రీకి సంబంధించిన సమాచారాన్ని బహిర్గతం చేయడం కుదరదని ఢిల్లీ హైకోర్టు తీర్పునిచ్చింది. దీనికి సంబంధించి ప్రధాన సమాచార కమిషన్ ఇచ్చిన ఆదేశాన్ని ఢిల్లీ హైకోర్టు పక్కన పెట్టింది. సమాచార హక్కు పిటిషన్‌కు ప్రతిస్పందనగా ఢిల్లీ విశ్వవిద్యాలయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ డిగ్రీ వివరాలను బహిర్గతం చేయాలని పేర్కొంటూ ప్రధాన సమాచార కమిషన్ ఇచ్చిన ఆదేశాన్ని ఢిల్లీ హైకోర్టు నిలిపివేసింది.

ప్రధాని మోదీ విద్యా రికార్డ్, డిగ్రీ గురించిన సమాచారం బహిర్గతం చేయాల్సిన అవసరం లేదని ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ సచిన్ దత్తా తెలిపారు. అయితే, ఈ అంశంపై ఇరు పార్టీలు సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి మోదీ విద్యా రికార్డులను బహిర్గతం చేయడంపై దాదాపు దశాబ్ద కాలంగా ఈ న్యాయ పోరాటం కొనసాగుతోంది. వాస్తవానికి 1978లో (ఢిల్లీ యూనివర్శిటీ) నుంచి పరీక్షలో ఉత్తీర్ణులైనట్టు ప్రధాని మోదీ తన ఎన్నికల అఫిడవిట్ లో చూపించారు.

ప్రధాని మోదీ విద్యా రికార్డు కోసం 2016లో ఖీఎ దరఖాస్తుతో ఈ వ్యవహారం ప్రారంభమైంది. మూడో పక్షానికి సంబంధించిన సమాచారాన్ని పంచుకోకూడదనే నియమాలను పేర్కొంటూ విశ్వవిద్యాలయం దానిని తిరస్కరించింది. అయితే, ప్రధాన సమాచార కమిషన్ ఈ వాదనను అంగీకరించలేదు. అంతేకాదు, డిసెంబర్ 2016లో ఆజ తనిఖీని అనుమతించాలని ఆదేశించింది. ప్రజాప్రతినిధి, ముఖ్యంగా ప్రధానమంత్రి విద్యార్హతలు పారదర్శకంగా ఉండాలని చెప్పింది. అలాగే ఈ సమాచారాన్ని కలిగి ఉన్న రిజిస్టర్‌ను ప్రజాపత్రంగా పరిగణిస్తారని కూడా పేర్కొంది. దీంతో ఆ ఉత్తర్వునకు వ్యతిరేకంగా హైకోర్టును ఢిల్లీ విశ్వవిద్యాలయం ఆశ్రయించింది.

భారత సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ కేసులో తన వాదనలు వినిపిస్తూ, వేలాది మంది విద్యార్థుల గోప్యత హక్కు ప్రజలు తెలుసుకునే హక్కు కంటే విలువైందని వాదించారు. డేటాను విడుదల చేయడం ప్రమాదకరమన్నారు. విశ్వవిద్యాలయం రికార్డును కోర్టు పరిశీలన కోసం సమర్పించడానికి సిద్ధంగా ఉంటుందని, కానీ దానిని బహిరంగపరచకూడదని ఆయన చెప్పారు. రికార్డును కోరుకునే వాళ్ళు .. ప్రచారం కోసమో.. లేదా రాజకీయ ఉద్దేశ్యాలతోనో కోరుతున్నారని అన్నారు.అయితే, తరఫు న్యాయవాది దీనికి భిన్నంగా తన వాదన వినిపించారు. మోదీ విద్యా రికార్డును కోరుతున్న కార్యకర్తల ఉద్దేశాన్ని తాము పరిగణనలోకి తీసుకోమని వాదించారు. డిగ్రీ అనేది రాష్ట్రం మంజూరు చేసే అర్హత. ఇది ప్రైవేట్ విషయం కాదని, ప్రధానమంత్రి విద్యార్హతలు ముఖ్యమైన ప్రజా ప్రయోజనానికి సంబంధించిన విషయమని కోర్టుకు విన్నవించే ప్రయత్నం చేశారు. ఈ మేరకు హైకోర్టు తీర్పునిచ్చింది.

## ఈగల్ టీమ్, పోలీసులు సంయుక్త ఆపరేషన్.. రేవ్ పార్టీ ముఠా గుట్టురట్టు

హైదరాబాద్, ఆగష్టు 25:ఈగల్ టీమ్, గచ్చిబౌలి పోలీసులు సంయుక్త ఆపరేషన్ నిర్వహించి రేవ్ పార్టీ భగ్నం చేశారు. మాదాపూర్ డీసీపీ వినీత్ దీనికి సంబంధించి మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ రైడ్ కు సంబంధించి డీసీపీ ఏమన్నారంటే, 'రాజేశ్వరి నిలయం అనే సర్వీస్ అపార్ట్మెంట్‌లో రైడ్ నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నాం. అరెస్ట్ అయిన వారిలో డ్రగ్ పెడ్లర్లు తేజ, విక్రమ్ తోపాటు, ముగ్గురు వినియోగదారులు నీలిమ, పురుషోత్తం, భార్గవ్ ఉన్నారు. ట్రాన్స్‌పోర్టర్ చందన్ కూడా వీరిలో ఉన్నారు' అని డీసీపీ చెప్పారు.

నిందితుల నుంచి డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామని, 20 గ్రాముల కొకైన్, 08 ఎక్స్టసీ పిల్స్, మూడు గ్రాముల ఎండీఎంఏ సీజ్ చేశామని డీసీపీ తెలిపారు. ఈ కేసులో బెంగళూరుకు చెందిన రాహుల్, మణిదీప్ ఇద్దరు పరారీలో ఉన్నారని డీసీపీ వెల్లడించారు.

'విక్రమ్, తేజ, నీలిమ డ్రగ్స్ ప్రొక్యూర్ చేసి గోవా, రాజమండ్రిలో రేవ్ పార్టీలు నిర్వహించేవారు. తేజ న్యూ ఇయర్ సందర్భంగా గోవాలో ఒక రేవ్ పార్టీ ఏర్పాటు చేశారు. అందులో నీలిమ కూడా ఉన్నారు. పట్టుబడ్డ నిందితులు ప్రతిసారీ రేవ్ పార్టీకి రాహుల్ వద్ద డ్రగ్స్ కొనుగోలు చేసేవారు. ఈ కేసులో పట్టుబడ్డ డ్రగ్ పెడ్లర్ విక్రమ్.. మల్నాడు రెస్టారెంట్ సూర్యకు స్నేహితుడని' డీసీపీ తెలిపారు.

'ఈ కేసులో మరో నిందితుడు మణిదీప్ డిప్యూటీ తహసీల్దార్ గా పని చేస్తున్నాడు. మణిదీప్ రాజమండ్రిలో నివసిస్తూ అక్కడ, గోవాలో పార్టీలు అరెంజ్ చేస్తున్నాడు. రాజమండ్రిలో మణిదీప్‌కు సొంత ఫాంహౌస్ ఉంది. అక్కడా రేవు పార్టీలు ఏర్పాటు చేశాడు. నీలిమ, తేజకు మణిదీప్ డ్రగ్స్ అలవాటు చేశాడు. విక్రమ్, నీలిమ ఐటీ ఉద్యోగులు. తేజకు క్లౌడ్ కిచెన్ బిజినెస్ ఉంది. బిజినెస్‌లో లాభాలు రాకపోవడంతో రేవ్ పార్టీ అరెంజ్ చేస్తున్నాడు. బెంగళూరుకు చెందిన రాహుల్ కు నైజీరియన్ మైక్ డ్రగ్స్ సప్లయ్ చేశాడు. తేజ డబ్బులు ఇస్తే చందన్ డ్రగ్స్ తీసుకువస్తాడు. బ్లూటో థియాన్ ఇంజెక్షన్ మాటున ఈ డ్రగ్స్ తీసుకువచ్చారని' డీసీపీ వెల్లడించారు.

## చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు : సీఐ రాజశేఖర్ రెడ్డి

నల్గొండ, ఆగషు 25: చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతూ ప్రజా శాంతికి విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని నల్లగొండ వన్ టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో పలు రకాల నేరాలు చేసి, రౌడీషీట్లు నమోదైన 20 మందికి అలాగే పాత నేరస్తులకు రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల దృష్ట్యా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రౌడీ షీటర్ల కదలికలపై పోలీసుల నిఘా ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడి, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కేసులు నమోదు చేసి, పీడీ యాక్ట్ నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు.

గత నేర ప్రవృత్తిని వదిలేసి, సమాజ హితంగా బతకాలని సూచించారు. పట్టణంలో సామాన్య ప్రజలకి ఇబ్బంది కలిగేలా, సామాన్య ప్రజలను బెదిరించినట్లుగా ఎటువంటి సమాచారం తెలిసినా వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరిని బైండోవర్ చేయడం జరుగుతుందని, దాన్ని ఉల్లంగించిన వారికి రూ.2 లక్షల జరిమానతో పాటు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సతీశ్, సైదులు, సిబ్బంది షకీల్, రబ్బాని, సైదులు, శ్రీకాంత్ వెంకన్న పాల్గొన్నారు.

## ఆ కేబుల్ వైర్లు తొలగించండి.. హైకోర్టు కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, ఆగష్టు 25:నగరంలోని విద్యుత్ స్తంభాలపై అమర్చిన ఇంటర్నెట్, కేబుల్ వైర్ల తొలగింపు అంశంపై హైకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. ఇటీవల రామంతాపూర్‌లో జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడంతో ఈ సమస్యపై దృష్టి సారించారు. విచారణలో, విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుళ్ల కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తేల్చారు.

ఈ నేపథ్యంలో, జీహెచ్ఎంసీ పరిధిలోని విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుళ్లను అధికారులు తొలగించడం ప్రారంభించారు. అయితే, అనుమతులు పొందిన కేబుళ్లను కూడా తొలగిస్తున్నారని సంబంధిత సంస్థ కోర్టులో పిటిషన్ వేసింది. అయితే, తాము అనుమతి పొందిన స్తంభాల వివరాలను సమర్పించాలంటూ టీజీఎస్పీడీసీఎల్ న్యాయవాది సూచించారు. వాదనలు విన్న ధర్మాసనం, అనుమతి లేకుండా అమర్చిన కేబుళ్లను తొలగించాలని స్పష్టం చేసింది. అనంతరం ఈ కేసుపై తదుపరి విచారణకు తేదీని నిర్ణయించి వాయిదా వేసింది.

## విద్యతోనే పోటీ..!

హైదరాబాద్, ఆగష్టు 25:ప్రపంచంతో పోటీ పడాలంటే విద్య ద్వారానే సాధ్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం జూబ్లీహిల్స్ లో ఓ ప్రైవేట్ సంస్థ విద్యారంగంపై రూపొందించిన కాఫీ టేబుల్ ఆవిష్కరణ అనంతరం ఆయన ప్రసంగించారు. రానున్న 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రభుత్వం విద్యారంగాన్ని పటిష్టం చేస్తుందని తెలిపారు. సామాజిక మార్పు వెనుకబాటుతనాన్ని రూపుమాపాలన్న, సమ సమాజ స్థాపనకు విద్య ఒక్కటే మార్గం అని చెప్పారు. ట్రిపుల్ ఐటీ, ఆర్ఈసీ, యూనివర్సిటీ ఏర్పాటులతోనే మన తెలుగు వాళ్లు ప్రముఖ కంపెనీలకు సీఈఓల స్థాయికి ఎదిగారని వివరించారు.

### సామాజిక అవసరాలకు అనుగుణంగా సిలబస్ మారాలి..

మారుతున్న సామాజిక అవసరాలకు అనుగుణంగా సిలబస్ మారితేనే ప్రయోజనం అని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ భావించిన తర్వాత స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. పరిశ్రమలకు పనికొచ్చేలా సిలబస్ రూపొందించామని తెలిపారు. రాష్ట్రంలో కొన్ని దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన 100 ఐటీఐ లను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చామన్నారు. వివిధ పరిశ్రమల అధిపతులు సూచించిన సిలబస్ ను వాటిలో ప్రవేశపెట్టామని తెలిపారు.

పేదలకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు దేశంలో ఎక్కడా లేని విధంగా 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్లు పెట్టుబడితో అసెంబ్లీ నియోజకవర్గానికి కనీసం ఒకటి చొప్పున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 104 యంగ్ ఇండియా పాఠశాలల నిర్మాణానికి జీవో జారీ చేశామని, పాఠాలు బోధించే సిబ్బంది కూడా అక్కడే ఉండేలా వసతులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

కోటి ఉమెన్స్ కాలేజీ కి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టి రూ.500 కోట్లతో భవన నిర్మాణాలు చేపడుతున్నామని, ఉస్మానియా యూనివర్సిటీలో కావలసిన అన్ని వసతులను ఏర్పాటు చేస్తున్నామని, బీసీల నియామకం చేశామని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

## హైదరాబాద్‌ను కేసీఆర్ కనిపెట్టినట్లు కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉంది

హైదరాబాద్, ఆగష్టు 25: మాజీ మంత్రి కేటీఆర్‌కు కాంగ్రెస్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. హైదరాబాద్‌ను కేసీఆర్ కనిపెట్టినట్లు కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కేటీఆర్ ఎందుకు ఇలా మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని విమర్శించారు. కేసీఆర్ హయంలో నాలుగు ఫ్లై ఓవర్లు, దుర్గం చెరువు సెల్ఫీ పాయింట్ తప్పా ఏలాంటి అభివృద్ధి జరగలేదని గుర్తుచేశారు. ఇవాళ(సోమవారం) గాంధీభవన్‌లో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.

బరాబర్‌గా స్థానిక ఎన్నికలు పెడతాం.. 42శాతం బీసీ రిజర్వేషన్ ఇస్తామని సవాల్ విసిరారు. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్లే దమ్ముందా అని కేటీఆర్ అంటున్నారని.. పదేళ్లలో 60 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారితే.. అప్పుడు మీ దమ్ముకు దుమ్ము పట్టిందా. అని సెటైర్లు గుప్పించారు. హైదరాబాద్‌లో ఎక్కువ ఎమ్మెల్యేలు గెలిచిన గులాబీ పార్టీకి.. పార్లమెంట్‌లో బీఆర్ఎస్‌కి సున్న వచ్చిందని దెప్పిపొడిచారు. కంటోన్మెంట్‌లో గులాబీ పార్టీ మూడో స్థానానికి దిగజారిందని విమర్శించారు. మీడియా సమావేశాలు మూడు పూటలు పెట్టకపోతే.. ప్రజలు మర్చిపోతారని కేటీఆర్ అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ పతివ్రత మాటలు మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. హైదరాబాద్‌ను మీ కుటుంబం వాడుకొని.. ఆర్థికంగా ఎదిగారని విమర్శించారు. చంద్రబాబు, వైఎస్ ఉన్నప్పుడు కూడా హైదరాబాద్ అభివృద్ధి కుంటు పడలేదని చెప్పుకొచ్చారు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి.

హరీష్‌రావు ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నప్పుడు డెంగ్యూ మరణాల సంఖ్య ఉందని గుర్తుచేశారు. కేవలం రేవంత్ రెడ్డి హయాంలో మాత్రమే డెంగ్యూ వస్తోందని.. ఎప్పుడూ లేదన్నట్లు హరీష్‌రావు మాట్లాడటం విడ్డూరంగా ఉందని సెటైర్లు గుప్పించారు. వర్షాకాలం వచ్చిందంటే.. డెంగ్యూ వస్తుందని తెలిపారు. ఓబీసీలకు రిజర్వేషన్ కావాలనే తాము ప్రయత్నాలు చేస్తున్నామని ఉద్ఘాటించారు. లోకల్ బాడీ ఎన్నికల్లో ఏ ప్రభుత్వం ఏం చేసిందో తెలుస్తుందని తెలిపారు.బీజేపీకి పది మంది ఎమ్మెల్యేలు లేరని.. స్థానిక సంస్థల్లో సగం స్థానాలు ఎలా వస్తాయని ప్రశ్నల వర్షం కురిపించారు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి.

ఎట్టి పరిస్థితుల్లోనైనా బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని సబ్ కమిటీ వేశామని నొక్కిచెప్పారు. బీసీలపై బీజేపీ, బీఆర్ఎస్‌లకు చిత్తశుద్ధి ఉంటే.. 42శాతం పార్టీ పరంగా ఇస్తామని ప్రకటించాలని ఛాలెంజ్ చేశారు. రేవంత్‌రెడ్డిని బీజేపీ ఎంపీలు కాపాడితే.. తెలంగాణ నంబర్ వన్ అయ్యేదని..మెట్రో ఫేజ్- 2 వచ్చేదని స్పష్టం చేశారు. పది మంది ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోవడం అనేది వాళ్ల ఇండివిజ్యువల్ కెపాసిటీ అని చెప్పుకొచ్చారు. తెలంగాణకి రావాల్సిన వాటాను.. గుజరాత్, ఏపీకి కేంద్రం పంపుతోందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు.

## సరిహద్దుల్లో పాక్ డ్రోన్లు... బలగాలు అప్రమత్తం

శ్రీనగర్, ఆగష్టు 25:జమ్మూకాశ్మీర్ పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి పాక్ డ్రోన్లు కలకలం సృష్టించాయి. ఆదివారం రాత్రి సరిహద్దు అవతల 6 డ్రోన్లు ఎగురుతూ కనిపించడంతో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. రాత్రి 9.15 గంటలకు డ్రోన్ల కదలికలు మెంధార్ సెక్టార్‌లో కనిపించాయని, వెంటనే అడ్డుకునేందుకు వీల్లేనంత ఎత్తులో ఎగురుతూ, కొద్ది నిమిషాలకే పాక్ భూభాగంలోకి వెళ్లిపోయాయని అధికారులు తెలిపారు.

నిఘా కోసం ఈ డ్రోన్లను పాక్ ప్రయోగించి ఉండవచ్చని అనుమానిస్తున్న భద్రతా దళాలు సోమవారం సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. డ్రోన్లతో ఆయుధాలు, మాదకద్రవ్యాలను జారవిడిచి ఉండచ్చనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నాయి.

## భార్య పుట్టింటికి వెళ్లడంతో పురుగుల మందు తాగిన భర్త.. చికిత్స పొందుతూ మృతి

హైదరాబాద్, ఆగష్టు 25:భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్థాపానికి గురై మల్లెపల్లి శోభన్(42) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కాసిపేట ఏఎస్సై బూర రవీందర్‌తెలిపారు. తాండూర్‌కు చెందిన రేచిన్, అన్నారానికి చెందిన మల్లెపల్లి శోభన్ అనే ఇద్దరు దంపతులు సోమగూడెంలో నివాసం ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు.

భార్యభర్తల గొడవ విషయంలో భార్య పుట్టింటికి వెళ్లినందుకు మనస్థాపం చెంది ఆదివారం పురుగుల మందు సేవించాడు. అతడి పరిస్థితి విషమంగా మారడంతో కుటుంబ సభ్యులు మంచిర్యాల ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని, ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెల్లడించారు .




కిన్నెర ఆర్ట్ థియేటర్స్ & మాతృభాషా సమితి-ఆహ్వానం



తెలుగు భాషా దినోత్సవ సందర్భంగా
డా॥ సగిలి సుధారాణిగారు
సంపాదకత్వం వహించిన
ప్రాచీన తెలుగు
మార్గాన్వేషణ-పరిష్కరణ
శాసనాలు-నాణేలు-తాళపత్రాలు- లిపి
గ్రంథావిష్కరణ
శుక్రవారం 29-8-2025, సా॥ 5:30 గంటలకు
తెలంగాణ సారస్వత పరిషత్, తిలక్ రోడ్, అబిడ్స్, హైదరాబాద్

ముఖ్యఅతిథి : శ్రీ యన్. రామచంద్రరావు
అధ్యక్షులు, భారతీయ జనతాపార్టీ, తెలంగాణ

అధ్యక్షులు : డా॥ కె.వి.రమణ, ఐఎఎస్ (రి)
పూర్వ సలహాదారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

సభాప్రారంభకులు : ఆచార్య వెలుదండ నిత్యానందరావు
ఉపాధ్యక్షులు, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం

విశిష్ట అతిథి : శ్రీ యం. నాగేశ్వరరావు, సంపాదకులు, ఈనాడు ఆంధ్రప్రదేశ్

ఆత్మీయ అతిథి : డా॥ శ్రీరంగాచార్య, ప్రముఖ సాహితీ వేత్త

గౌరవ అతిథి : డా॥ చింతపల్లి వసుంధరా రెడ్డి
మాతృభాషా సమితి అధ్యక్షురాలు

సాంస్కృతిక కార్యక్రమం : సా॥ 5:30 నుండి 6-30 వరకు నృత్య కిన్నెర సమర్పించు
మా తెలుగు తల్లికి మల్లెపూదండ కూచిపూడి నృత్య రూపకం
నృత్య దర్శకత్వం: హంస పురస్కార గ్రహీత, కేంద్ర సంగీత నాటక అకాడమి పురస్కార గ్రహీత
డా॥ మద్దాళి ఉషాగాయత్రి
రచన : శ్రీ బ్నిం సంగీతం: శ్రీమతి వెంపటి శ్రీవల్లీ శర్మ

డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (రి) అధ్యక్షులు, కిన్నెర
ఎస్.ఎస్. రాజు గౌ॥ అధ్యక్షులు, మాతృభాషా సమితి
మద్దాళి రఘురామ్ కార్యదర్శి, కిన్నెర

# డిజిటల్ యుగంలోనూ ఆడది అంటే అలుసే !

## (26 ఆగస్టు "మహిళా సమానత్వ దినోత్సవం" సందర్భంగా)

ప్రపంచ మహిళ నేటికీ పురుషాధిక్య సమాజంలో ద్వితీయ శ్రేణి పౌరురాలుగానే భావించబడుతున్నది. లింగ అసమానతలు వెర్రితలలు వేస్తున్నాయి. ఆడది అబలగానే వంటింటి కుందేలు అవుతున్నది. ఆర్థిక స్వేచ్ఛ ఆమడదూరంలో ఉన్నది. ఆమె గళం గడప దాటడం లేదు. పడతి మాటకు విలువ లేదు. ఒంటరి మహిళను అసహ్యంగా చూస్తున్నా సమాజం మనది. ఆమె తెర వెనుక శ్రమ జీవి, ఆయన తెరపైన కాలర్ ఎగిరేసే పురుష పుంగవుడు. భర్త చనిపోతే సతీ సహగగమనం పాటించిన సమాజం మనది. ఆమె శ్రమకు విలువ పాతాళంలో, ఆయన శ్రమ విలువ ఆకాశమంత. ఆమె ఎన్నటికీ అత్తింటికి వెళ్లే ఆడదే. కొన్ని దేశాల్లో మహిళలను ఓటు హక్కు కూడా లేకపోవడం విచారకరం.

మహిళా సమానత్వ దినోత్సవ చరిత్ర:

1970లో అమెరికాలో మహిళా హక్కుల కోసం లక్ష మంది మహిళలు రోడ్డుపై చేరి ఆందోళన చేయడంతో నాటి అధ్యక్షుడు రిచర్డ్స్ నిక్సన్ చొరవతో అమెరికాలో 1920 ఆగష్టు 26వ తేదీన 19వ రాజ్యాంగ సవరణ ద్వారా మహిళలకు ఓటు హక్కు కల్పించడం జరిగింది. ఈ విప్లవాత్మక ప్రగతిశీల నిర్ణయానికి గుర్తుగా ప్రతి ఏట 26 ఆగష్టు రోజున (1971 నుంచి) "మహిళా సమానత్వ దినం" లేదా "వూమెన్ ఈక్వాలిటీ డే" పాటించడం కొనసాగుతున్నది. నాడు అమెరికాలో ప్రారంభమైన మహిళా సమానత్వ దినోత్సవం నేడు ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవడం అభినందనీయం.

భారత్‌లో మహిళా సమానత్వానికి సవాళ్లు:

భారతదేశంలో మహిళా సమానత్వ సాధనకు కృషి జరిగినా నేడు కూడా లింగ ఆధార్ అసమానతలు వెక్కిరిస్తూనే ఉన్నాయి. మహిళా సమానత్వ సాధన సవాళుగా మారింది. నేడు యుద్ధ పైలెట్లు, సైనికులు, అంతరిక్ష శాస్త్రవేత్తలుగా మహిళలు తమ శక్తి సామర్థ్యాలను రుజువు చేసుకుంటున్నారు. అయినా చేయవలసింది ఇంకా ఎంతో ఉన్నది. విద్య, రాజకీయ రంగాలు పురుషాధిక్యతను ప్రదర్శిస్తున్నాయి. సామాజిక కట్టుబాట్లు మహిళా సేచ్ఛను హరించివేస్తున్నాయి. లింగ ఆధార ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. మహిళలకు రాజకీయంగా ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతున్నది. ప్రభుత్వ విద్యా సంస్థలు, ఉద్యోగాల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం, నైపుణ్య విద్యను అందించడం, ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా ముందుకు రావడం, నిర్ణయాలు తీసుకునే అధికారం రావడం లాంటివి జరుగుతున్నాయి. అయినా సామాజిక కట్టుబాట్లు, ఆచారాలు, ముసుగులు మహిళాభివృద్ధికి అడ్డుగా నిలుస్తున్నాయి. అమ్మాయిలకు ఉన్నత విద్య అందని ద్రాక్ష అవుతున్నది. రాజకీయ రంగంలో మహిళలకు అవకాశాలు కల్పించడంలో ఒవిఫలం అవుతున్నాం. వేతనాల కల్పనలో వ్యత్యాసాలు వెక్కిరిస్తున్నాయి. శ్రమ చేయడంలో మహిళా శక్తికి విలువ ఇవ్వడం లేదు. మహిళ భద్రత గాల్లో దీపం అవుతున్నది. ఆర్థిక అవకాశాలు ఆమెను చులకనగా చూస్తున్నాయి. స్వేచ్ఛ ఆమెకు ఆమెడ దూరంలో నిలుచుంది. ఆమెకు అవకాశాలు లభించడం లేదు.

ప్రస్తుత కర్తవ్యం ఏమిటి ?

మహిళా సమానత్వ సాధనకు చట్టాలను చేసి, ఉన్న చట్టాలను అమలు పరిచి, ఆమెను ముందుకు నడిపించడానికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. చట్ట సభల్లో ఆమె సగ భాగం కావాలి. శ్రమ చేయడానికి ఆమెకు ఉన్నత విద్య, నైపుణ్యాలను పెంపొందించాలి. సామాజిక కట్టుబాట్లు, మూఢనమ్మకాల గోడలను బద్దలు కొట్టాలి. మహిళా భద్రతకు పెద్ద పీట వేయాలి. మహిళా సాధికారత దిశగా అడుగులు పడాలి. మహిళల్ని వివిధ రంగాల్లో నాయకత్వ స్థానాల్లోకి తీసుకురావాలి. బాలురకు సమానంగా బాలికలకు విద్యను అందించాలి. నేటి బాలికలో రేపటి నాయకురాలిని చూడగలగాలి. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, కై??మార దశలోనే గర్భం దాల్చడం, లైంగిక వేధింపులు, శ్రమ దోపిడీ, మహిళలపై హింస లాంటి దురాచారాలకు స్వస్తి పలకాలి.

మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ, ఉద్యోగ ఉపాధులను కల్పిస్తూ, శ్రమ దోపిడీని అరికడుతూ, విద్య అనే ఆయుధాన్ని అందిస్తూ, సామాజిక కట్టుబాట్లను ఛేదిస్తూ, లింగ సమానత్వ దిశగా వడివడిగా అడుగులు వేస్తూ ఆమెను అందలం ఎక్కిద్దాం, మహిళను కేంద్ర బిందువుగా చేసుకొని సుస్థిరాభివృద్ధికి పునాదులు వేద్దాం.

–డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# నైపుణ్యాభివృద్ధికి నూతన జాతీయ విద్యావిధానం అధిక ప్రాధాన్యమిస్తుంది: పీఎం

న్యూఢిల్లీ, ఆగష్టు 25:గుజరాత్ లోని అహ్మదాబాద్ లో కన్యా ఛత్రాలయలో సర్దార్‌ధామ్ ఫేజ్– ఎవి శంకుస్థావన సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వీడియో సందేశం ద్వారా ఈ రోజు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికల సేవ, విద్యకు అంకితమైన ఈ వసతి గృహం స్థాపన గురించి వివరిస్తూ.. సర్దార్ ధామ్ పేరు లాగే అది చేసే కృషి కూడా పవిత్రమైనదని ప్రధానమంత్రి అన్నారు. ఈ హాస్టల్లో వసతి పొందే బాలికలు... అనేక ఆకాంక్షల్నీ, ఆశయాలనీ కలిగి ఉంటారని, వాటిని నెరవేర్చుకొనేందుకు అనేక అవకాశాలు లభిస్తాయని ఆయన వెల్లడించారు. ఈ అమ్మాయిలు స్వావలంబన, శక్తి సాధించినప్పుడు.. దేశ నిర్మాణంలో వారు సహజంగానే కీలకపాత్ర పోషిస్తారని, వారి కుటుంబాలు సాధికారత సాధిస్తాయని శ్రీ మోదీ స్పష్టం చేశారు. ఈ వసతి గృహంలో ఉండే అవకాశం లభించిన బాలికలకు, వారి కుటుంబాలకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని ఆకాంక్షిస్తూ.. హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

బాలికల వసతి గృహం ఫేజ్ 2కు శంకుస్థావన చేసే అవకాశం లభించినందుకు కృతజ్ఞత వ్యక్తం చేస్తూ.. సమాజం చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నాల ద్వారా 3,000 మంది అమ్మాయిలకు అద్భుతమైన ఏర్పాట్లతో నిండిన మంచి సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని శ్రీ మోదీ పేర్కొన్నారు. అలాగే 2,000 మంది విద్యార్థుల కోసం వడోదరాలో చేపడుతున్న నిర్మాణ పనులు దాదాపు పూర్తికావచ్చాయని ఆయన తెలిపారు. విద్య, అభ్యాసం, శిక్షణ కోసం ఇదే తరహా కేంద్రాలను సూరత్, రాజ్‌కోట్, మెహ్సానాలో అభివృద్ధి చేస్తున్నట్లు ప్రధాని వెల్లడించారు. సామాజిక బలంతోనే దేశం పురోగతి సాధిస్తుందని చెబుతూ.. ఈ కార్యక్రమాల్లో భాగస్వాములైన వారందరికీ ఆయన తన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే సర్దార్ వల్లభభాయ్ పటేల్‌కు నివాళులు అర్పించారు.

గుజరాత్ ముఖ్యమంత్రిగా తాను పని చేసిన రోజుల్ని గుర్తుకు తెచ్చుకుంటూ.. భారత పురోగతికి, గుజరాత్ అభివృద్ధి అవసరమని తాను ఎల్లప్పుడూ విశ్వసిస్తానని ప్రధాన మంత్రి అన్నారు. గుజరాత్ నుంచి నేర్చుకున్న పాఠాలే ఇప్పుడు దేశాభివృద్ధికి దోహదపడుతున్నాయన్నారు. 25-30 ఏళ్ల క్రితం సంబంధిత సూచికలకు సంబంధించి సామాజిక సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో.. వాటిని ఎదుర్కోవడానికి గుజరాత్ తన శక్తినంతా ఉపయోగించిన విధానాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. అమ్మాయిలు చదువులో వెనకబడి ఉన్నారని, చాలా కుటుంబాలు బాలికలను పాఠశాలకు పంపించడం లేదని, బడిలో చేర్పించినా వారు మధ్యలోనే చదువు మానేస్తున్నారని తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత తెలుసుకొని బాధపడ్డానని శ్రీ మోదీ తెలిపారు. ఈ పరిస్థితుల్లో మార్పు రావడానికి 25 ఏళ్ల క్రితం ప్రజలు అందించిన మద్దతును ప్రశంసించారు. జూన్ నెలలో 40-42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలోనూ ప్రతి గ్రామాన్ని, ప్రతి ఇంటిని సందర్శించి బాలికలను స్కూలుకు తీసుకెళ్లిన "కన్యా శిక్ష రథ యాత్ర" గురించి సభలో ఉన్నవారికి ప్రధానమంత్రి గుర్తు చేశారు. ఈ యాత్ర కారణంగా బడిలో చేరిన వారి సంఖ్య పెరిగిందని తెలిపారు. ఆ కృషికి ఇప్పుడు ఫలితం దక్కుతోందని సంతృప్తి వ్యక్తం చేశారు. దీనివల్ల పాఠశాల మౌలిక వసతులు అభివృద్ధి చెందాయని, ఆధునిక సౌకర్యాలను కల్పించామని, వ్యవస్థలు బలోపేతమయ్యాయని, ఉపాధ్యాయులను నియమించామని ప్రధాని పేర్కొన్నారు. సమాజం కూడా చురుగ్గా పాల్గొని తన బాధ్యతలను నెరవేర్చింది. ఆ సమయంలో పాఠశాలల్లో చేరిన చిన్నారులు ఇప్పుడు డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యారని, బడిమానేసే వారి సంఖ్య తగ్గిందని, నేర్చుకోవాలన్న తపన గుజరాత్ అంతా వ్యాపించిందని అన్నారు.

మరో ప్రధాన సమస్య అయిన స్త్రీ శిశు– భ్రూణహత్యలను ఖండిస్తూ.. వాటిని తీవ్ర కళంకమైన చర్యలుగా వర్ణించారు. ఈ సమస్య చుట్టూ అల్లుకున్న సామాజిక ఆందోళనకు వ్యతిరేకంగా ప్రారంభించిన ఉద్యమానికి తనకు లభించిన మద్దతును గుర్తు చేసుకున్నారు. స్త్రీపురుష సమానత్వాన్ని పెంపొందించేందుకు సహకరించిన సూరత్ నుంచి ఉమియా మాత వరకు జరిగిన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. ఉమియా మాత, ఖోడియార్ మాత, కాళీ మాత, అంబా బాత, బహుచార్ మాత ఇలా స్త్రీ శక్తిని పూజించే భూమి గుజరాత్‌లో – ఆడ భ్రూణహత్య అనే కళంకాన్ని మోయకూడదని అన్నారు. ఈ భావన మేల్కొని, విస్తృతమైన మద్దతు లభించిన తర్వాత స్త్రీ–పురుష నిష్పత్తిలో అంతరాన్ని గుజరాత్ విజయవంతంగా తగ్గించిందని అన్నారు.

"సమాజ సంక్షేమం కోసం ఉన్నతమైన ఉద్దేశాలు, పవిత్రతతో ప్రయత్నాలు ప్రారంభించినప్పుడు సమాజం, దైవం తోడ్పాటు అందిస్తాయి. సమాజమే దైవిక శక్తిగా మారతుంది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఇలాంటి ప్రయత్నాలు కచ్చితంగా మంచి ఫలితాలను తీసుకొస్తాయని, ప్రస్తుతం సమాజంలో కొత్త జాగృతి ఉద్భవించిందని.. ఇప్పుడు తమ కుమార్తెలకు చదువును అందించేందుకు, వారి గౌరవాన్ని పెంచేందుకు, వారికి హాస్టళ్లతో సహా అవసరమైన వసతులను నిర్మించేందుకు ప్రజలు ముందుకు వస్తున్నారని అన్నారు. గుజరాత్‌లో నాటిన విత్తనాలు ఇప్పుడు జాతీయ ఉద్యమంగా మారాయని – "బేటీ బేటియాన్, బేటి పఢావో" – ప్రజా ఉద్యమంగా మారిందని అన్నారు. దేశవ్యాప్తంగా మహిళల భద్రత, సాధికారతకు దేశవ్యాప్తంగా చారిత్రక చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావిస్తూ.. మహిళల వాణి బలంగా వినిపించిందని, వారి సామర్థ్యాలకు గుర్తింపు లభించిందని ప్రధానమంత్రి అన్నారు. గ్రామాల్లో "లఖ్‌పతీ దీదీ"లను ఉదాహరణగా చూపిస్తూ.. 3 కోట్ల మందిని తయారు చేయాలన్న లక్ష్యంలో ఇప్పటికే 2 కోట్లను సాధించామని అన్నారు. గ్రామాల్లో మహిళల పట్ల సామాజిక భావనలను "డ్రోన్ దీదీ" తరహా కార్యక్రమాలు మార్చాయని అన్నారు. "బ్యాంకు సఖి", "బీమా సఖి" లాంటి పథకాల గురించి శ్రీ మోదీ ప్రస్తావించారు. ఈ కార్యక్రమాలు దేశంలోని మాతృశక్తి ద్వారా గ్రామీణ ఆర్థిక వృద్ధిని చురుకుగా ముందుకు నడిపిస్తున్నాయని అన్నారు.

సానుకూల వైఖరితో సమాజానికి తోడ్పాటును అందిస్తూనే తమ సామర్థ్యాలను పెంపొందించుకొనేలా వ్యక్తుల్ని ప్రోత్సహించాలన్నది విద్య అతి ప్రధాన ప్రయోజనం కావాలని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ప్రతి రోజూ ఉరుకులు పరుగులు తీస్తున్న ఈనాటి లోకంలో, ఈ లక్ష్యం మరింత ఆవశ్యకమని ఆయన తెలిపారు. నైపుణ్యాలలో, ప్రతిభను చాటుకోవడంలో పోటీపడుతుండాలని పిలుపునిచ్చారు. సమాజపు వాస్తవ శక్తిని దానికున్న నైపుణ్యం సూచిస్తుందన్నారు. భారత్‌లోని నైపుణ్యభరిత శ్రమశక్తికి ప్రపంచ దేశాల్లో మంచి డిమాండు ఉన్న సంగతిని శ్రీ మోదీ ప్రధానంగా ప్రస్తావిస్తూ, ఇదివరకటి ప్రభుత్వాలు కొన్ని ఏళ్ల తరబడి కాలంచెల్లిన విద్యావ్యవస్థనే చలామణీలో ఉంచాయని విమర్శించారు. తన ప్రభుత్వం ప్రధాన సంస్కరణల్ని తీసుకువచ్చిందనీ, పురాతన పద్ధతుల్ని తోసిరాజని విద్యాబోధన ముఖచిత్రాన్ని మార్చిందనీ ఆయన వివరించారు.

కొత్త జాతీయ విద్యావిధానం నైపుణ్యాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యాన్ని కట్టబెడుతోందని ప్రధానమంత్రి గుర్తుచేస్తూ, స్కిల్ ఇండియా మిషన్'లో భాగంగా ప్రభుత్వం లక్షల మంది యువతీయువకులను వివిధ రంగాల్లో నిపుణులుగా తీర్చిదిద్దేందుకు పాటుపడుతోందన్నారు. ప్రపంచ దేశాలు వృద్ధుల సమస్యను ఎదుర్కొంటున్నాయనీ, వాటికి యువ ప్రతిభావంతుల అవసరం ఉందనీ చెబుతూ, భారత్‌కు ఈ విషయంలో నాయకత్వం వహించగల సామర్థ్యం ఉందన్నారు. "యువతకు నైపుణ్యం జతపడితే ఉద్యోగావకాశాలకు లోటు ఉండదు.. వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.. ఆత్మనిర్భరతకు ప్రోత్సాహం లభిస్తుంది" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. యువతకు అవసరమైన ఉపాధి అవకాశాలను కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటున్నదని ఆయన ఆయన తెలిపారు.

పదకొండేళ్ల కిందట, భారత్‌లో అంకుర సంస్థలు ఏవో కొన్ని మాత్రమే ఉండేవని శ్రీ మోదీ గుర్తు చేస్తూ ప్రస్తుతం వీటి సంఖ్య 2 లక్షలకు చేరుకొంటోందన్నారు. ఇప్పుడివి రెండో అంచె, మూడో అంచె నగరాల్లోనూ ఏర్పాటు అవుతున్నాయని ఆయన తెలిపారు. ముద్రా యోజనను ప్రవేశపెట్టడంతో, యువత పూచీకత్తు లేకుండానే బ్యాంకు రుణాలను అందుకొనే అవకాశం లభించిందని ఆయన తెలిపారు. యువత స్వయంఉపాధి కల్పన కోసం రూ.33 లక్షల కోట్లను అందించినట్లు తెలిపారు. లక్షలాది మంది యువత సొంత కాళ్ల మీద నిలబడటంతోపాటు వారు ఇతరులకు కూడా ఉద్యోగాలను ఇస్తున్నట్లు చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తాను చేసిన ప్రసంగాన్ని ప్రధానమంత్రి గుర్తుచేస్తూ... 1 లక్ష కోట్ల రూపాయలతో 'ప్రధాన్ మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రకటించి, దానిని వెంటనే అమల్లోకి తీసుకువచ్చామన్నారు. ఎవరినైనా ప్రయివేటు రంగంలో నియమించుకొంటే, ఈ కార్యక్రమంలో భాగంగా వారి ప్రారంభ వేతనంలో రూ.15 వేలను ప్రభుత్వం అందజేస్తుంది.

"దేశం నలుమూలల మౌలిక సదుపాయాల అభివృద్ధి అపూర్వ స్థాయిలో చోటుచేసుకొంటోంది" అని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. 'పీఎం సూర్య ఘర్ యోజన'లో భాగంగా సౌర శక్తి ఉత్పాదక వ్యవస్థల్ని ఏర్పాటు చేసే పనులు చురుగ్గా సాగుతున్నాయని ఆయన తెలిపారు. డ్రోన్, రక్షణ పరిశ్రమల్లో నిరంతర వృద్ధి కనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. యంత్రాధారిత తయారీ ప్రక్రియపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెడుతోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాలన్నీ గుజరాత్‌లో కొత్త ఉపాధి అవకాశాలను కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నాయని ఆయన వివరించారు.

"ప్రస్తుతం భారతదేశ శ్రమ శక్తి, ప్రతిభ విలువను ప్రపంచ దేశాలు గుర్తిస్తున్నాయి. గౌరవిస్తున్నాయి. ఫలితంగా, వేర్వేరు దేశాల్లో అనేక అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి" అని శ్రీ మోదీ తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, విద్య, అంతరిక్షం వంటి రంగాల్లో భారతీయ యువత ప్రపంచ వ్యాప్తంగా చెప్పుకోదగ్గ గుర్తింపు తెచ్చుకొంటోంది. వీళ్లు తమ శక్తియుక్తులతోను, విజయాలతోను ప్రపంచ దేశాల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తున్నారని ఆయన చెప్పారు.

ఎర్ర కోట నుంచి తాను చేసిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధానంగా ప్రస్తావించిన స్వావలంబన, దేశీయంగా ఉత్పత్తి అంశాలను ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. భారత్ స్వయంసమృద్ధంగా మారి తీరాలని కోరుతూ, స్వదేశీ ఉత్పాదనలను నమ్మకంతో స్వీకరించాల్సిందిగా సమాజానికి ఆయన పిలుపునిచ్చారు.

ఆహూతులను ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగిస్తూ... ప్రజల తోడ్పాటును ప్రశంసించారు. గత కాలంలో తాను ఏవైనా పనుల్ని అప్పగించి మార్కులను సంపాదిస్తే సంపాదించి ఉండవచ్చు కాని, ఆయా పనులను పూర్తి చేసి ఫలితాలను అందించింది ప్రజలేనన్నారు. ఇప్పటి వరకు తాను చూసిన ప్రజాజీవనం అంతటిలో తన అంచనాలు పూర్తి కాని సందర్భమంటూ లేదని ఆయన చెప్తూ, ఈ నమ్మకమే కొత్త కొత్త బాధ్యతల్ని అప్పజెప్పాలన్న తన కోరికను బలపరుస్తోందన్నారు.

ప్రస్తుతం ప్రపంచ దేశాల్లో నెలకొని ఉన్న అస్థిర పరిస్థితుల్లో స్వావలంబనను సాధించడమే భారత్ ముందున్న అత్యుత్తమ మార్గమని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. స్వావలంబన అంటే మన దేశంలో తయారైన వస్తువులకు పెద్ద పీట వేయడం, భారత్‌లో తయారీ (మేక్ ఇన్ ఇండియా) కార్యక్రమాన్ని ఉత్సాహంగా ముందుకు తీసుకుపోతుండడమే అని ఆయన వివరించారు. "స్వదేశీ ఉద్యమం శతాబ్దాల నాటి స్మారకం కాదు.... అది భవిష్యత్తుకు బలాన్నందించే ఒక ఉద్యమం .. మరి ఈ ఉద్యమానికి సారథ్యం సమాజం నుంచే, అది కూడా యువత నుంచే రావాలి" అని ప్రధానమంత్రి ప్రధానంగా చెప్పారు. ఏ విదేశీ వస్తువూ తమ ఇళ్లలోకి రాకూడదని కుటుంబాలు సంకల్పం చెప్పుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. 'మేడ్ ఇన్ ఇండియా' అంటూ తాను ఇచ్చిన పిలుపును విన్న తరువాత, విదేశాల్లో పెళ్లిళ్లు పెట్టుకున్న వాళ్లు ఆ కార్యక్రమాల్ని రద్దు చేసుకొని భారత్‌లోనే వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారంటూ ప్రధానమంత్రి కొన్ని ఉదాహరణలను ప్రస్తావించారు. ఈ రకం ఆలోచనలు సహజంగానే దేశభక్తి భావనను మేల్కొలుపుతాయని ఆయన అన్నారు.

"భారత్‌లో తయారీ (మేక్ ఇన్ ఇండియా)తో పాటు స్వయంసమృద్ధి సహిత భారత్ (ఆత్మనిర్భర్ భారత్).. వీటిలో దక్కిన సాఫల్యం అందరిదీ, అంతేకాదు.. ఇది అందరి బలాన్నీ సూచిస్తోంది. ఇది భావి తరాల వారి కోసం వేసిన పునాది" అని శ్రీ మోదీ అభివర్ణించారు. ప్రజలు భారతీయ ఉత్పాదనలను ఎంపిక చేసుకోవడం మొదలుపెడితే మార్కెట్లో పోటీ, మెరుగైన ప్యాకేజింగు, తక్కువ ఖర్చు.. ఈ కారణాలతో నాణ్యత దానంతట అదే మెరుగుపడుతుందని ఆయన అన్నారు. మన దేశ కరెన్సీని దేశం సరిహద్దులు దాటి బయటకు పోనివ్వడం సరైంది కాదని ఆయన స్పష్టం చేశారు.

తాను అప్పగించిన చిన్న పనిని సమాజం అవగాహనతో పూర్తి చేయడంతో పాటు దేశానికి కొత్త శక్తిని అందిస్తుందన్న నమ్మకాన్ని ప్రధానమంత్రి వ్యక్తం చేశారు. ప్రస్తుతం సమాజం వ్యవసాయ ప్రధానమైందే కాక, కొత్తగా పరిశ్రమలను నెలకొల్పాలన్న ఆసక్తితో కూడా ఉందని, దీనిని గమనించాల్సిందిగా వాణిజ్య రంగ ప్రముఖులకు ఆయన విజ్ఞప్తి చేశారు. "ఇక్కడ స్వదేశీ ఉత్పాదనలు మాత్రమే అమ్ముతాం" అనే ప్రకటనలను ప్రదర్శించాల్సిందిగా వాణిజ్య ప్రముఖులకు ఆయన సూచించారు. మన దేశంలో తయారైన వస్తువులనే కొనాలని వినియోగదారులను ప్రోత్సహించాల్సిందిగాను, స్వదేశీ వస్తువులను మాత్రమే విక్రయిస్తామంటూ వాణిజ్య ప్రముఖులు తమకు తాము ఒక కట్టుబాటును విధించుకోవాల్సిందిగాను వారికి శ్రీ మోదీ సలహా ఇచ్చారు. ఆపరేషన్ సిందూర్ మాత్రమే దేశభక్తి కాదు, ఇది కూడా దేశభక్తిని చాటే పనే.. స్వదేశీని అక్కున చేర్చుకోవడమంటే అది ఒక రకంగా దేశానికి చేస్తున్న సేవేనని శ్రీ మోదీ స్పష్టం చేశారు. ఈ సెంటిమెంటును ప్రజల చెంతకు చేరుస్తూ వారి నిబద్ధతను, తోడ్పాటును చాటిచెప్పాల్సిందిగా ప్రధానమంత్రి కోరారు. ప్రధానమంత్రి తన ప్రసంగాన్ని ముగించే ముందు, ప్రజల మధ్యకు వచ్చేందుకు తనకు అవకాశాన్ని ఇచ్చినందుకు ప్రగాఢ కృతజ్ఞతలను వ్యక్తం చేసి, అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆడపడుచులను మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.

# స్థానిక ఎన్నికల్లో 46 శాతం రిజర్వేషన్లు

### -తెలంగాణలో యూరియా కొరత లేదు

### -మూడు వేల కోట్లతో నిజామాబాద్-నిర్మల్-ఆదిలాబాద్ రైల్వే లైన్



నిజామాబాద్, ఆగష్టు 25:అబద్దాలతోనే అధికారంలో ఉన్న కాంగ్రెస్ కాలయాపన చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు అన్నారు. ఈ రోజు ఇందూర్‌లోని బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో రైతుబంధు బంద్ అయిందని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల పేరుతో, గ్యారంటీల పేరుతో అనేక వాగ్దానాలు చేసి మాట తప్పిందని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని, రైతు భరోసా సరిగ్గా ఇవ్వలేదని చెప్పారు. ఓటు చోరీతోనే బీజేపీ గెలుస్తోందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారని, ఏ ఓటర్ లిస్టుతో బీజేపీ సభ్యులు గెలిచారో, అదే లిస్టుతో కాంగ్రెస్ నాయకులు కూడా గెలిచారన్నారు. ఏ యంత్రాంగం ఎన్నికలు నిర్వహించిందో, అదే యంత్రాంగం నిర్వహించిన ఎన్నికల్లో కాంగ్రెస్ కూడా 8 ఎంపీలను గెలిపించుకుందన్నారు.

స్థానిక ఎన్నికల్లో 46 శాతం రిజర్వేషన్లు..

ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్ల గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్, మరోవైపు పది శాతం మతపరమైన రిజర్వేషన్లు ముస్లింలకు ఇవ్వాలని ప్రయత్నం చేస్తోందని అన్నారు. స్థానిక ఎన్నికల్లో 46 శాతం రిజర్వేషన్లు బీజేపీ తరపున బీసీలకే ఇస్తామని, ఎందుకంటే బీసీలకు చెందాల్సిన రిజర్వేషన్లు బీసీలకే ఇవ్వాలన్నారు.

తెలంగాణలో యూరియా కొరత లేదు..

కాంగ్రెస్ నాయకులు యూరియా కొరత అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని రామచందర్ రావు అన్నారు. బీజేపీ ఎక్కడా కూడా యూరియా పంపిణీని ఆపలేదని, తెలంగాణకు అవసరమైనంత మేరకు యూరియా సరఫరా చేసిందని, తెలంగాణలో నడుస్తోంది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన కృత్రిమ యూరియా కొరత మాత్రమే అని అన్నారు. తాను పలు జిల్లాల్లో పర్యటించి కలెక్టర్లతో మాట్లాడానని, ఎక్కడా కూడా యూరియా కొరత లేదని వారు చెప్పారు.

రైతులకు బేడీలు వేసింది.. బీఆర్ఎస్ ప్రభుత్వం

తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటగా రైతులకు బేడీలు వేసిన ప్రభుత్వం బీఆర్ఎస్ అని, రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా జరిగినది కూడా బీఆర్ఎస్ పాలనలోనే అని, అందుకే రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదని రామచందర్ రావు అన్నారు. నిజామాబాద్ జిల్లాలో అనేక మంది ఉపాధి కోసం గల్ఫ్ వెళ్తున్నారని, వారి కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ తో పాటు బీజేపీ ఎంపీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారని, కాని ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదన్నారు.

మూడు వేల కోట్లతో నిజామాబాద్–నిర్మల్–ఆదిలాబాద్ రైల్వే లైన్

రైల్ కనెక్టివిటీని బలపరిచే దిశగా నిజామాబాద్–నిర్మల్–ఆదిలాబాద్ రైల్వే లైన్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.3 వేల కోట్లతో నిర్మాణం చేపట్టిందని రామచందర్ అన్నారు. అనేక జాతీయ రహదారుల నిర్మాణం కూడా ఎన్డీయే ప్రభుత్వం చేపట్టిందన్నారు. గ్రామీణ పేదలకు ఉచిత బియ్యం, మరుగుదొడ్లు, యువతకు స్వయం ఉపాధి రుణాలు.. ఇవన్నీ కేంద్ర నిధులతోనే అమలు చేస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీలను, గ్యారంటీలను అమలు చేయని కాంగ్రెస్ పార్టీ ని రానున్న ఎన్నికల్లో ఓడించి, బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

# పారిశ్రామిక కేంద్రంగా గాంధీనగర్ గుట్ట



జయశంకర్ భూపాలపల్లి, ఆగష్టు 25జయశంకర్ జిల్లా గణపురం మండలం గాంధీనగర్ మైలారం గుట్ట ఇండస్ట్రియల్ హబ్‌గా ఏర్పాటు చేస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. ఈ రోజు రెవెన్యూ, ఇండస్ట్రీయల్, ఇతర అధికారులతో కలిసి గుట్టపై జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ ప్రాంతాన్ని టూరిజం, ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చి దిద్దుతున్నామన్నారు. ఇండస్ట్రీస్ పార్కు 60 ఎకరాల్లో 197 ప్లాట్లు కేటాయించామని, స్క్వేర్ ఫీట్ రూ.1600 లకు టెండర్ ఓపెన్ అవుతుందని తెలిపారు. వచ్చేనెల ఒకటో తేదీ నుండి పారిశ్రామిక వేత్తలు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్‌హబ్ కు 40 ఎకరాలు, కేంద్రీయ విద్యాలయానికి పది ఎకరాలు, సైనిక్ స్కూల్ కు ఇరవై ఎకరాలు, అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ కు 15 ఎకరాలు కేటాయించామన్నారు. ఇప్పటికే రోడ్డ పనులకు రూ. 4 కోట్లు ఖర్చు చేశారని అభివృద్ధి కి మరో రూ.15 కోట్లు నిధులు సమకూర్చుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా పవిత్ర..

నూర్యాపేట, ఆగష్టు 25: నూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా సేవలందిస్తున్న మారం పవిత్ర ప్రతిష్ఠాత్మకమైన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలు పురస్కారానికి ఎంపికయ్యారు. విద్యారంగంలో తన కృషి, బోధనలో కొత్త పద్ధతుల అమలు, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంలో ఆమె చూపిన అంకితభావం ఫలితంగా ఈ గుర్తింపు దక్కింది.

ఆమె సాధనను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలు పురస్కారంతో సత్కరించనుంది. ఈ సందర్భంగా విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు పవిత్రను అభినందించారు.

# గంజాయి సాగు..

ఆదిలాబాద్, ఆగష్టు 25:పంటల సాగు మాటున గంజాయి సాగు చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఆ వ్యక్తి నుంచి 12.4 కిలోల ఉన్న 95 మొక్కలను స్వాధీనం చేసుకున్నారు.

వీటి విలువ సుమారు రూ.9.5 లక్షలు ఉంటుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.

ఆదిలాబాద్ జిల్లా నార్నూరు మండలం సుంగాపూర్ శివారులో కడప మోతీరాం అనే వ్యక్తి సాధారణ పంటలతోపాటు గంజాయి సాగు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది.

దీంతో సీసీఎస్ పోలీసు బృందాలు సోదాలు చేసి గుర్తించారు. ఈ మేరకు నార్నూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు కడప మోతీరాంను పోలీసులు అరెస్టు చేశారు.

# 'ల్యాబ్ విద్యార్థిని' బలవన్మరణం

అమరావతి, ఆగష్టు 25: అనంతపురం లో ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు విద్యార్థిని స్వాతి (22) ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండకు చెందిన స్వాతి అనంతపురం సాయినగర్ లోని ఓ ప్రైవేట్ హాస్టల్లో ఉంటూ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చేస్తోంది.

సోమవారం తెల్లవారుజామున ఫ్యాన్ కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపుతోంది. తోటి విద్యార్థులు స్వాతి ని హుటాహుటిన అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆమె ప్రాణాలు గాల్లో కలసి పోయాయి. స్వాతి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

# జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నాడు.. కేటీఆర్



హైదరాబాద్, ఆగష్టు 25: రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోకుండా, తెలంగాణకు ద్రోహం చేయడంలో మాత్రం కలిసి పనిచేస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రధాని నరేంద్ర మోదీల మధ్య అంతర్గత ఒప్పందం ఉందని, దానివల్ల తెలంగాణ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆర్మూరు బీజేపీ నాయకురాలు ఆలూరు విజయభారతి, పలువురు బీజేపీ నాయకులు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డిపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

"రేవంత్ రెడ్డి జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నారు. గతంలో మా బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన భవనాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడానికి తాపత్రయ పడుతున్నారు. ఆ కత్తెర పట్టుకుని జాగ్రత్తగా తిరగండి," అంటూ కేటీఆర్ సెటైర్ వేశారు. ఈ రోజు ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వెళ్లిన రేవంత్ రెడ్డి.. గతంలో కేసీఆర్ పునాది వేసిన భవనాలను ప్రారంభించి వచ్చారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న 'వికృతమైన' మాటలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. గత ముఖ్యమంత్రులతో పోల్చి చూసి రేవంత్‌ను బండ బూతులు తిడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులు చేయకపోవడాన్ని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. "గోదావరి నీళ్లను దిగువకు పంపి చంద్రబాబు కడుతున్న కనకచెర్ల ప్రాజెక్టుకు, అక్కడి నుంచి తమిళనాడుకు తరలించేందుకు రేవంత్ కుట్ర చేస్తున్నాడు. ఇది మోదీ, చంద్రబాబు ఆదేశాల మేరకే జరుగుతోంది" అని అన్నారు. మోదీ, చంద్రబాబు ఆదేశాల మేరకే రేవంత్ రెడ్డి గోదావరి నీళ్లను కిందికి పంపించేందుకు కుట్ర చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. "కాళేశ్వరం నీళ్లు ఆగకుండా, గోదావరి నీళ్లు కిందికి వెళ్లి చంద్రబాబు కడుతున్న బనకచెర్ల ప్రాజెక్టుకు, అక్కడి నుంచి తమిళనాడుకు వెళ్లాలనేది కేంద్రంలోని బీజేపీ, రేవంత్‌కు ఇచ్చిన ఆదేశం. అందుకే రేవంత్ కాళేశ్వరం ప్రాజెక్టుపై పగ పట్టారు," అని కేటీఆర్ తెలిపారు.

# రోడ్డెక్కిన ఎమ్మెల్యేలు

ఆదిలాబాద్, ఆగష్టు 25: యూరియా కోసం రైతులు తెల్లవారక ముందే బారులు తీరుతూ పడరాని పాట్లు పడుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ లో రైతుల నిరసనలు తారస్థాయికి చేరుకున్నాయి. యూరియా కొరతను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మండిపడుతూ సోమవారం కొమరం భీం జిల్లాలో ఎమ్మెల్యేలు రోడ్డెక్కి నిరసన బాట పట్టారు.

**కాగజ్ నగర్ లో ఆందోళన..**

యూరియాను ప్రభుత్వం బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తోందని సిర్పూర్ టి ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు ధ్వజమెత్తారు. ఒక బస్తా యూరియా కోసం రైతులు వ్యవసాయ పనులు మాని, పస్తులతో బారులు తీరుతున్నారు. పంట అదును దాటిన తర్వాత యూరియా వస్తే ఏం లాభమని ప్రశ్నించారు. కేంద్రం సబ్సిడీ తో రూ.266 బస్తా రైతులకు ఇస్తుంటే, రూ.600 కు బయట మార్కెట్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. అనంతరం రైతులతో కలిసి మార్కెట్ యార్డ్ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఎమ్మెల్యే హరీశ్ బాబును బలవంతంగా పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లారు. రెండు రోజుల్లో యూరియా కొరత తీరుస్తామని అధికారులు నచ్చి చెప్పడంతో ఆందోళన విరమించారు.

ఆసిఫాబాద్ లో ఎమ్మెల్యే కోవలక్ష్మి నిరసన

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో యూరియా కొరతపై రైతులు ప్రాథమిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద నిరసన తెలిపారు. అక్కడి ఎమ్మెల్యే కోవలక్ష్మి రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా కొరతను సృష్టించి రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్నారని, ప్రభుత్వం తక్షణమే యూరియా ఇవ్వకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# మొదటి గ్లోబల్ ఎలక్ట్రిక్ కారు 'ఈ-విటారా'ను హన్సల్‌పూర్‌లో ప్రారంభించనున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 25:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆగస్టు 25, 26 తేదీల్లో గుజరాత్‌లో పర్యటించనున్నారు. ఆగస్టు 25న సాయంత్రం 6 గంటలకు అహ్మదాబాద్‌లోని ఖోడల్‌ధామ్ మైదానంలో రూ. 5,400 కోట్ల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేయటంతో పాటు కొన్నింటికి శంకుస్థాపన చేయనున్నాను. ఈ సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో ఆయన మాట్లాడనున్నారు.

ఆగస్టు 26న ఉదయం 10:30 గంటలకు అహ్మదాబాద్‌లోని హన్సల్‌పూర్‌లో హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల ఉత్పత్తిని బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాల 100 దేశాల ఎగుమతి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అనుసంధానతకు సంబంధించిన తన నిబద్ధతకు అనుగుణంగా.. రూ. 1,400 కోట్లకు పైగా విలువైన బహుళ రైల్వే ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నారు. ఇందులో రూ. 530 కోట్ల వ్యయంతో 65 కి.మీ. మహేసానా-పాలన్‌పూర్ రైల్వే మార్గంలో వేసిన రెండో లైను.. రూ.860 కోట్లతో గేజ్ మార్పిడి చేసిన 37 కి.మీ. కలోల్-కాడి-కటోసన్ రోడ్ రైలు మార్గం.. రూ.860 కోట్లతో గేజ్ మార్చిన చేసిన 40 కి.మీ బెచ్రాజీ-రనుజ్ రైలు మార్గాలు ఉన్నాయి. ఇవి ఈ ప్రాంతానికి బ్రాడ్-గేజ్ ప్రయోజనంతో పాటు సులభమైన, సురక్షితమైన, మరింత మెరుగ్గా ఉండే అనుసంధానతను అందిస్తాయి. ఇది రోజువారీ ప్రయాణికులతో పాటు పర్యాటకులు, వ్యాపారాలకు.. ప్రయాణ సౌలభ్యాన్ని పెంచుతుంది. అదే సమయంలో ఆర్థికంగా ప్రాంతీయ అసమానతలను తగ్గిస్తుంది. కటోసన్ రోడ్, సబర్మతి మధ్య ప్రారంభించనున్న రైలు వల్ల పుణ్యక్షేత్రాలకు ప్రయాణం సులువు అవుతుంది. తద్వారా క్షేత్ర స్థాయిలో ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయి. బెచ్రాజీ నుంచి కార్లను తీసుకెళ్లే రైలు ప్రారంభోత్సవం వల్ల రాష్ట్ర పారిశ్రామిక కేంద్రాలకు అనుసంధానత పెరుగుతుంది. ఇది సరకు రవాణా నెట్‌వర్క్‌ను బలోపేతం చేయటమే కాకుండా కాకుండా ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది.

అనుసంధానతను మెరుగుపరచడం, ప్రయాణికుల భద్రతను పెంచడం, ప్రాంతీయ అభివృద్ధిని వేగవంతం చేయాలనే తన దార్శనికతను మరింత ముందుకు తీసుకెళ్తూ ప్రధాని.. విరామ్‌గామ్-ఖుదాద్-రాంపురాలో విస్తరించిన రహదారిని ప్రారంభించనున్నారు. అహ్మదాబాద్- మెహ్సానా-పాలన్‌పూర్ రహదారిపై ఆరు వరుసల వాహన అండర్‌పాస్‌లకు, అహ్మదాబాద్-విరామ్‌గామ్ రహదారిపై రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టులన్నీ ఈ ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేయటమే కాకుండా రవాణా సామర్థ్యాన్ని, ఆర్థిక అవకాశాలను మెరుగుపరచనున్నాయి.

రాష్ట్ర విద్యుత్ రంగానికి ప్రధాని పర్యటనలో భారీ ఊతం లభించనుంది. అహ్మదాబాద్, మెహ్సానా, గాంధీనగర్‌లలో ఉత్తర గుజరాత్ విజ్ కంపెనీ లిమిటెడ్‌కు (యూజీవీసీఎల్) చెందిన విద్యుత్ పంపిణీ ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. పునరుద్ధరించిన పంపిణీ రంగ పథకం (రివ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్) కింద నష్టాలను తగ్గించడం, సరఫరా నెట్‌వర్క్‌ను ఆధునీకీకరించడం, మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే లక్ష్యంతో ఈ ప్రాజెక్టులను చేపట్టారు. రూ.1000 కోట్లకు పైగా విలువైన ఈ ప్రాజెక్టులు ప్రతికూల వాతావరణ పరిస్థితులలో విద్యుత్ సరఫరా వైఫల్యాలు, అంతరాయాలను తగ్గిస్తాయి. దీనితో పాటు ప్రజలకు మరింత భద్రతను అందిస్తాయి. ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ ఏర్పడుతుంది. విద్యుత్ సరఫరా నెట్‌వర్క్ విశ్వసనీయతను మెరుగుపరుస్తాయి.

పట్టణ పీఎంఏవైలోని మురికివాడల అభివృద్ధి అంశం (ఇన్ సిటు స్లమ్ రిహాబిలిటేషన్) కింద రామపిర్ నో టెక్రోలోని సెక్టార్ -3లో పునర్నిర్మించిన మురికివాడ అభివృద్ధి కార్యక్రమాలను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ట్రాఫిక్ నిర్వహణను సులభతరం చేసేందుకు, అనుసంధానతను మెరుగుపరచడానికి అహ్మదాబాద్ చుట్టూ ఉన్న సర్దార్ పటేల్ రింగ్ రోడ్ ప్రధాన రహదారి విస్తరణ ప్రాజెక్టులకు కూడా ఆయన శంకుస్థాపన చేయనున్నారు. మంచి నీరు, మురుగు నీటి నిర్వహణ వ్యవస్థలను బలోపేతం చేయడానికి ఉద్దేశించిన కీలకమైన పట్టణ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కూడా ఆయన శంకుస్థాపన చేయనున్నారు.

పరిపాలనా సామర్థ్యాన్ని, ప్రజలకు సేవలకు అందించే తీరును మెరుగుపరుస్తూ గుజరాత్‌లో కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. పౌర కేంద్రీకృత సేవలను మెరుగుపరచడమే లక్ష్యంగా అహ్మదాబాద్ పశ్చిమంలో కొత్త స్టాంపులు- రిజిస్ట్రేషన్ భవనం.. రాష్ట్రవ్యాప్తంగా సురక్షితమైన డేటా నిర్వహణ, డిజిటల్ పాలన సామర్థ్యాలను పెంపొందించడానికి గాంధీనగర్‌లో నిర్మించిన రాష్ట్ర స్థాయి డేటా స్టోరేజ్ కేంద్రం ఇందులో ఉన్నాయి.

ఆగస్టు 26న అహ్మదాబాద్‌లోని హన్సల్‌పూర్‌లోని సుజుకి మోటార్ ఉత్పత్తి కేంద్రంలో జరగనున్న రెండు చరిత్రాత్మక కార్యక్రమాలను ప్రధాని ప్రారంభించనున్నారు. ఇవి ప్రపంచ హరిత రవాణా కేంద్రంగా భారత్ ఆవిర్భావాన్ని తెలియజేస్తాయి. దీనితో పాటు భారత్‌లో తయారీ, ఆత్మనిర్భర్ భారత్ పట్ల ప్రధానమంత్రి నిబద్ధతను ముందుకు తీసుకువెళ్తాయి.

భారత్‌లో తయారీ విజయానికి ఒక ప్రధాన ఉదాహరణగా నిలిచే సంఘటన ఇక్కడ జరగనుంది. సుజుకీ కంపెనీకి సంబంధించిన మొట్టమొదటి బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనం (బీఈవీ) 'ఈ-విటారా'ను ఆయన ప్రారంభించనున్నారు. తన ప్రపంచ వ్యూహంలో భాగంగా సుజుకీ దీనిని తీసుకొచ్చింది. భారత్‌లో తయారైన ఈ కార్లు.. యూరప్, జపాన్ వంటి అభివృద్ధి చెందిన మార్కెట్లతో పాటు వందకు పైగా దేశాలకు ఎగుమతి కానున్నాయి. సుజుకి ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించి ప్రపంచ తయారీ కేంద్రంగా భారత్ మారనుంది.

హరిత ఇంధన రంగంలో ఆత్మనిర్భర్‌గా మారే దిశగా ఒక పెద్ద ముందడుగు ప్రధాని పర్యటన సందర్భంగా పడనుంది. గుజరాత్‌లోని టీడీఎస్ లిథియం-అయాన్ బ్యాటరీ తయారీ కేంద్రంలో హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల స్థానిక ఉత్పత్తిని ఆయన ప్రారంభించనున్నారు. దీనితో భారత్‌లో బ్యాటరీలకు సంబంధించిన వ్యవస్థ తదుపరి దశ కూడా ప్రారంభం కానుంది. తోషిబా, డెన్సో, సుజుకిలు సంయుక్తంగా ఏర్పాటు చేస్తోన్న ఈ కేంద్రం దేశీయ తయారీ, హరిత ఇంధన ఆవిష్కరణలను పెంచనుంది. ఈ కేంద్రం వల్ల బ్యాటరీల్లో 80 శాతానికి పైగా మన దేశంలోనే తయారవుతాయి.

# కరాటే ఛాంపియన్షిప్ సాధించిన యజుర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు




హన్మకొండ, ఆగష్టు 25: ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్, కరాటే కుంగ్ ఫూ, టైక్వాండో ఛాంపియన్షిప్ 2025 పోటీలలో యజుర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రోలింగ్ షీల్డ్ సాధించారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ పోటీల్లో హనుమకొండ జిల్లా నుంచి వివిధ స్కూల్ విద్యార్థులు పాల్గొనగా యజుర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి వివిధ విభాగాలలో పథకాలను సాధించారు. తమ కృషి, శిక్షణ, ప్రతిభతో మెరిసిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

వరంగల్ ఉమ్మడి జిల్లా నుండి రోలింగ్ షీల్డ్ ఛాంపియన్షిప్ గెలుచుకున్న ఏకైక పాఠశాలగా ప్రత్యేక గుర్తింపు సాధించింది. ఈ ఛాంపియన్షిప్ పోటీలలో యజుర్ పబ్లిక్ స్కూల్ నుంచి మొత్తం 39 మంది విద్యార్థులు పాల్గొనగా ఇందులో 26 మంది స్వర్ణ పథకాలు, 10 మంది రజత పథకాలు, ముగ్గురు కాంస్య పథకాలు సాధించి ప్రతిభను చాటారు. ఈ విజయంతో యజుర్ పబ్లిక్ స్కూల్ మరో అంతర్జాతీయ స్థాయిలో కీర్తి పొందిందని ఈ గొప్ప విజయంలో విద్యార్థులకు శిక్షణ అందించిన కోచ్ క్రాంతికుమార్‌ను పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జలీల్ అహ్మద్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

# జీజీహెచ్‌లో లాప్రోస్కోపీ యూనిట్..

నల్గొండ, ఆగషు 25:నల్లగొండ ప్రభుత్వ సాధారణ ఆస్పత్రి (జీజీహెచ్) లో లాప్రోస్కోపీ యూనిట్ ను సోమవారం పద్మ విభూషణ్ డాక్టర్ నాగేశ్వర రెడ్డి, డాక్టర్ జి.వి.రావుతో కలిసి రాష్ట్ర రహదారులు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రారంభించారు.

కోమటి రెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ అధునాతన వైద్య సదుపాయాలు గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి రావడమే లక్ష్యమన్నారు. అందుకు కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉపయోగపడేలా సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు.

# మన వ్యోమగాములు భారత ఆకాంక్షలకు మార్గదర్శకులు: శ్రీ రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, ఆగష్టు 25:ఇస్రో మానవ సహిత తొలి అంతరిక్ష ప్రయోగం- గగన్‌యాన్‌లో భాగమైన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా, గ్రూప్ కెప్టెన్ పీబీ నాయర్, గ్రూప్ కెప్టెన్ అజిత్ కృష్ణన్, గ్రూప్ కెప్టెన్ అంగద్ ప్రతాప్‌లను న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో రక్షణమంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నలుగురు వ్యోమగాములను దేశ రత్నాలుగా, జాతీయ ఆకాంక్షలకు మార్గదర్శకులుగా అభివర్ణించారు.

అంతరిక్ష రంగంలో విస్తరిస్తున్న భారత ఉనికిని ప్రధానంగా ప్రస్తావిస్తూ.. "మనం అంతరిక్షాన్ని పరిశోధనా రంగంగా మాత్రమే కాకుండా, రేపటి ఆర్థిక వ్యవస్థ, భద్రత, శక్తి, మానవాళి భవిష్యత్తుగా చూస్తాం. మనం భూమి ఉపరితలం దాటి అంతరిక్షంలోని కొత్త సరిహద్దుల్లోకి క్రమంగా ముందుకు సాగుతున్నాం. చంద్రుని నుంచి అంగారక గ్రహం దాకా మనం చేరుకున్నాం. నేడు మన దేశం గగన్‌యాన్ వంటి ప్రయోగాలకు పూర్తిగా సిద్ధంగా ఉంది" అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు.

ఈ విజయం కేవలం సాంకేతికపరమైన విజయం మాత్రమే కాదు, ఆత్మనిర్భర్ భారత్‌లో ఒక కొత్త అధ్యాయంగా రక్షణమంత్రి అభివర్ణించారు. "ప్రపంచంలో అంతరిక్ష శక్తిని కలిగిన దేశాల్లో ఒకటిగా భారత్ సగర్వంగా నిలిచింది. మన అంతరిక్ష కార్యక్రమం కేవలం ప్రయోగశాలలు, ప్రయోగ వాహనాలకే పరిమితం కాదు. ఇది మన జాతీయ ఆకాంక్షలు, ప్రపంచ స్థాయి దార్శనికతకు ప్రతిబింబం. పరిమిత వనరులే ఉన్నప్పటికీ మన అపరిమిత సంకల్ప శక్తితో అత్యంత సవాలుతో కూడిన లక్ష్యాలను కూడా అద్భుతమైన విజయాలుగా మార్చగలమని చంద్రయాన్ నుంచి మంగళయాన్ దాకా సాగిన ప్రయోగాలతో మనం నిరూపించాం" అని ఆయన పేర్కొన్నారు.

కమ్యూనికేషన్ ఉపగ్రహాలు, వాతావరణ పర్యవేక్షణ, విపత్తు నిర్వహణ వంటి అంతరిక్షం నుంచి పొందిన సాంకేతికతలు దేశంలోని ప్రతి గ్రామానికి, ప్రతి రంగానికి సేవలను అందిస్తున్నాయని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. అంతరిక్ష ప్రయాణంలో భారత్ వెనకబడి ఉండకూడదని పేర్కొన్నారు. రాబోయే కాలంలో మానవ నాగరికత గమనాన్ని అంతరిక్ష మైనింగ్, లోతైన అంతరిక్ష అన్వేషణ, గ్రహ వనరులు పునర్నిర్వచించగలవని ఆయన తెలిపారు.

సైనిక శక్తికి, సాంకేతిక పరాక్రమానికి చిహ్నంగా అంతరిక్ష రంగం ఉందనీ, మానవ నాగరికత సమష్టి ప్రయాణంలో ఒక కొత్త దశగా నిలిచే ఒక యుగంలోకి ప్రపంచం ప్రవేశించిందని రక్షణమంత్రి పేర్కొన్నారు. "భారత్ ఎల్లప్పుడూ ప్రపంచానికి వసుధైక కుటుంబమనే సందేశాన్ని అందిస్తూనే ఉంది. మన శాస్త్రవేత్తలు, వ్యోమగాములు అదే సందేశాన్ని నేడు సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తున్నారు'' అని ఆయన పేర్కొన్నారు.

విజయవంతంగా అంతరిక్ష యాత్రను పూర్తిచేసిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాను ప్రశంసిస్తూ.. ఆయన దృఢ సంకల్పం, ధైర్యాన్ని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. ఈ యాత్ర భారత స్ఫూర్తిని ప్రతిబింబించింది. శుక్లాను జాతికి గర్వకారణంగా మార్చింది. "రెండున్నర సంవత్సరాల శిక్షణ రెండున్నర నెలల్లోనే పూర్తి చేయడం శుక్లా అంకితభావానికి నిదర్శనం. ఇది భారతీయుల పట్టుదలకు చిహ్నం. ఈ అసాధారణ ఘనత కేవలం సాంకేతిక సాధన మాత్రమే కాదు. ఇది విశ్వాసం, అంకితభావాల సందేశం. ఇది దేశానికి గర్వకారణం మాత్రమే కాదు. ఇది యావత్ మానవాళి పురోగతికి ఆధారం" అని ఆయన వ్యాఖ్యానించారు.

పౌర-సైనిక సేవల సమ్మిళిత చిహ్నంగా గ్రూప్ కెప్టెన్ శుక్లాను రక్షణమంత్రి అభివర్ణించారు. "ఆయన భారత వైమానిక దళ యూనిఫాం ధరించినప్పటికీ, అంతరిక్షంలోకి ఆయన ప్రయాణం కేవలం సాయుధ దళాలు.. భారత్ తరపున మాత్రమే కాకుండా యావత్ మానవాళికి ప్రతినిధిగా సాగింది. ఈ చారిత్రక లక్ష్యం ద్వారా పౌర సేవల రంగానికి ఆయన అందించిన సహకారం చరిత్రలో నిలిచిపోతుంది" అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

వ్యోమగాములను శారీరకంగా, మానసికంగా, భావోద్వేగపరంగా, ఆరోగ్యపరంగా సిద్ధం చేయవలసిన అవసరం ఎంతో ఉందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అభిప్రాయపడ్డారు. ఈ శిక్షణలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోస్పేస్ మెడిసిన్ పోషించిన కీలక పాత్రను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. "ఆ సంస్థ విజయానికి గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా ఒక గొప్ప నిదర్శనం" అని రక్షణమంత్రి వ్యాఖ్యానించారు.

గ్రూప్ కెప్టెన్ శుక్లా ఆక్సియమ్ మిషన్ 4లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి ప్రయాణించిన తన అసాధారణ అనుభవాలను ఈ సందర్భంగా పంచుకున్నారు. త్రివిధ దళాధిపతి అనిల్ చౌహాన్, వైమానిక దళాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సమీకృత గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థ తొలి వైమానిక పరీక్షలు విజయవంతంగా నిర్వహించిన డీఆర్‌డీవో

న్యూఢిల్లీ, ఆగష్టు 25:డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) నిన్న మధ్యాహ్నం 12.30 గంటలకు ఒడిశా తీరంలో సమీకృత గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థ (ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్) తొలి వైమానిక పరీక్షలు విజయవంతంగా నిర్వహించింది. ఈ ఐఏడీడబ్ల్యూఎస్ స్వదేశీ క్విక్ రియాక్షన్ సర్ఫేస్ టు ఎయిర్ క్షిపణులు (క్యూఆర్ఎస్ఏఎమ్), అడ్వాన్స్‌డ్ వెరీ షార్ట్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ (వీఎస్‌హెచ్ఓఆర్ఏడీఎస్) క్షిపణులు, హై-పవర్ లేజర్-ఆధారిత ఎనర్జీ వెపన్ (డీఈడబ్ల్యూ)లు గల బహుళ-అంచెల వైమానిక రక్షణ వ్యవస్థ.

రక్షణ రంగ పరిశోధన-అభివృద్ధి లాబొరేటరీ అభివృద్ధి చేసిన కేంద్రీకృత కమాండ్ - కంట్రోల్ సెంటర్ ఈ కార్యక్రమానికి నోడల్ లాబొరేటరీగా ఆయుధ వ్యవస్థకు చెందిన అన్ని విభాగాల సమగ్ర ఆపరేషన్‌ను నియంత్రిస్తుంది. వీఎస్‌హెచ్ఓఆర్ఏడీఎస్‌ను రీసెర్చ్ సెంటర్-ఇమారత్ పరిశోధనా కేంద్రం రూపొందించగా డీఈడబ్ల్యూను సెంటర్ ఫర్ హై ఎనర్జీ సిస్టమ్స్ అండ్ సైన్సెస్ అభివృద్ధి చేసింది.

వైమానిక పరీక్షల సమయంలో క్యూఆర్ఎస్ఏఎమ్, వీఎస్‌హెచ్ఓఆర్ఏడీఎస్, హై ఎనర్జీ లేజర్ ఆయుధ వ్యవస్థలు వివిధ పరిధులు, ఎత్తుల వద్ద రెండు హై-స్పీడ్ ఫిక్స్‌డ్ వింగ్ మానవరహిత వైమానిక వాహన లక్ష్యాలు, మల్టీ-కాప్టర్ డ్రోన్ సహా మూడు వేర్వేరు లక్ష్యాలను ఒకే సమయంలో పూర్తిగా ధ్వంసం చేశాయి. క్షిపణి వ్యవస్థలు, డ్రోన్ గుర్తింపు - విధ్వంస వ్యవస్థ, కమ్యూనికేషన్, రాడార్‌లతో పాటు ఆయుధ వ్యవస్థ కమాండ్ - కంట్రోల్ సహా అన్ని ఆయుధ వ్యవస్థ విభాగాలు ఎలాంటి లోపం లేకుండా చక్కగా పనిచేశాయి. విమాన డేటాను సంగ్రహించేందుకు చండీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ రూపొందించిన రేంజ్ సాధనాల ద్వారా దీనిని నిర్ధారించారు. డీఆర్‌డీవో సీనియర్ శాస్త్రవేత్తలు, సాయుధ దళాల ప్రతినిధులు ఈ పరీక్షలను ప్రత్యక్షంగా వీక్షించారు.

విజయవంతంగా ఐఏడీడబ్ల్యూఎస్‌ను అభివృద్ధి చేసిన డీఆర్‌డీవో, సాయుధ దళాలు, రక్షణ రంగ ప్రతినిధులను రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఈ సందర్భంగా అభినందించారు. ఈ ప్రత్యేక వైమానిక పరీక్షలు భారత బహుళ-అంచెల వైమానిక-రక్షణ సామర్థ్యాన్ని, శత్రువుల వైమానిక దాడుల నుంచి కీలక ప్రదేశాల రక్షణను మరింత బలోపేతం చేస్తాయని ఆయన పేర్కొన్నారు.

ఈ విజయవంతమైన వైమానిక పరీక్షల్లో పాలుపంచుకున్న అన్ని బృందాలను రక్షణ శాఖ పరిశోధన-అభివృద్ధి విభాగం కార్యదర్శి, డీఆర్‌డీవో ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ అభినందించారు.

# బోధన ఉపకరణాలతో సబ్జెక్టుపై విద్యార్థులకు ఆసక్తి పెంపు : డీఈవో యాదయ్య

మంచిర్యాల, ఆగష్టు 25: : విద్యార్థులకు బోధన ఉపకరణాలతో బోధించడం వల్ల ఆసక్తి పెరుగుతుందని మంచిర్యాల డీఈవో ఎస్ యాదయ్య పేర్కొన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా కాసిపేట ఉన్నత పాఠశాలలో మండల స్థాయి బోధనోపకరణాల మేళా నిర్వహించారు. ఈ మేళాను డీఈవో ప్రారంభించి ప్రతి బోధనోపకరణాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుల సృజనాత్మకతను అభినందించారు.

ఆయన మాట్లాడుతూ బోధనోపకరణాలు విద్యార్థుల్లో అభ్యాసం పట్ల ఆసక్తిని పెంపొందిస్తాయని, విద్యా ప్రమాణాల పెంపుదలకు దోహదపడతాయన్నారు. ప్రతి పాఠశాలలో బోధనోపకరణాల వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు. బోధనోపకరణాలు బోధనలో కీలక పాత్ర పోషిస్తాయని, ఉపాధ్యాయులు బోధనోపకరణాల ద్వారా విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యే విధంగా బోధించాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు దరి సత్యనారాయణ మూర్తి, విజయ లక్ష్మి, మండల విద్యాధికారి ముక్తవరం వెంకటేశ్వర స్వామి, కాంప్లెక్స్ హెచ్ఎంలు మామిడిపెల్లి సాంబమూర్తి, రమేష్ రాథోడ్, సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నగరంలో వేర్వేరు చోట్ల డ్రగ్స్ పట్టివేత..8మంది అరెస్ట్

హైదరాబాద్, ఆగష్టు 25:నగరంలో డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ పోలీసులు శనివారం అర్ధరాత్రి, ఆదివారం తెల్లవారుజామున వేర్వేరు చోట్ల దాడులు జరిపారు. ఈ దాడుల్లో 8మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 33.3గ్రాముల కొకైన్,7.97 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెలితే.నగరానికి చెందిన మిస్బహుద్దీన్ ఖాన్, అలీఅస్గర్‌లు డ్రగ్స్‌కు బానిసలుగా మారారు. డ్రగ్స్ తీసుకోవడానికి తరచూ బెంగుళూరు వెళ్లి గ్రాము కొకైన్ రూ.9వేలచొప్పున కొనుగోలు చేసి నగరానికి తీసుకొచ్చేవారు.

అమెరికా నుంచి నగరానికి వచ్చిన యూఎస్ఏ పౌరుడు జుబేర్ అలీ కారును వీరు రాకపోకలు సాగించేందుకు ఉపయోగించారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ పోలీసులు డ్రగ్స్ రవాణా చేస్తున్న మిస్బహుద్దీన్‌ఖాన్, అలీ అస్గర్‌లను రామ్‌కోఠిలోని వర్ధమాన్ బ్యాంక్ వద్ద రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 33.3గ్రాముల కొకైన్‌తో పాటు ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ ప్రాంతంలో సూటీపై అక్రమంగా ఎండీఎంఏ డ్రగ్స్ తరలిస్తున్న మిర్జా సాఫీ అలీ, అబ్దుల్ ఉబ వైట్ సయ్యద్, అబ్దుల్ హుస్సేన్‌లను అరెస్ట్ చేసి, 5.88 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. శేరిలింగంపలి ప్రాంతంలో నాగుల సాయి ప్రవీణ్, మనోచందర్, శ్రీవర్ధన్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి 2.07 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు.

# వినాయకుడికి వినతి పత్రం.. ఎరువుల కొరత తీర్చాలని కోరిన పద్మా దేవేందర్ రెడ్డి



మెదక్ ,ఆగస్టు 25 : హవెలీ ఘనపూర్ మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి రాష్ట్రంలో ఎరువుల కొరత తీరాలని కోరుకుంటూ విఘ్నేశ్వరుడి ప్రతిమకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతులకు ఎరువుల కొరత తీర్చడంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు విఫలం అయ్యాయని మండిపడ్డారు.

కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలకు, నాయకులకు బుద్ధి రావాలని విఘ్నేశ్వరుడికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రైతాంగం యూరియా కొరతతో కన్నీళ్లు పెడుతుందని అన్నారు. సొసైటీలు, ఆగ్రోస్ కేంద్రాల వద్ద లైన్‌లో నిలబడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కేసీఆర్ 10 సంవత్సరాల పాలనలో ఎన్నడూ యూరియా కొరత రాలేదు. రైతులకు రైతుబంధు రైతు బీమా ఇచ్చి రైతులను ఆదుకొని పంట పండించిన తరువాత పంటను కొని రైతు ఖాతాల్లో డబ్బులు వేసిన ఘనత కేసీఆర్‌దని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

రైతులు నాట్లు వేసిన నాటి నుండి ఇప్పటివరకు యూరియా కోసం రోడ్డెక్కిన పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వంలో నెలకొందని పేర్కొన్నారు. లైన్‌లో చెప్పులు పెట్టుకుని భార్యాభర్తలు నిలబడాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. కేసీఆర్ పాలనలో రైతులు ఎన్నడూ రోడ్డెక్కలేదు. కాంగ్రెస్ పాలనలో రైతులకు బోనస్ ఇస్తామని మోసం చేసి ఆరు గ్యారెంటీలు 420 హామీలు ఇచ్చింది కానీ ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. బీజేపీ కాంగ్రెస్ ప్రభుత్వాలకు బుద్ధి వచ్చే విధంగా రైతులకు యూరియా కొరత తీర్చాలని విఘ్నేశ్వరుడికి భక్తితో కోరి విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్లు ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్, బట్టి జగపతి, నాయకులు అంజాగౌడ్, కిష్టయ్య, మేకల సాయిలు, రామచంద్రారెడ్డి, సతీష్ రావు, జీవన్ రావు, గంగ. నరేందర్, రంజా, శ్రీనివాస్,సత్యం గౌడ్, లక్ష్మీనారాయణ,లింగారెడ్డి, కిషోర్, మోహన్ నాయక్, హనుమంత్ రెడ్డి, స్వామి నాయక్, రంజిత్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి, షిర్డీకి వెళ్లే భక్తులకు గుడ్‌న్యూస్.. ప్రత్యేక రైళ్లను ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే..!

ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. దసరా, దీపావళి, ఛట్ పూజ సందర్భంగా ప్రత్యేక రైళ్లను నడిపించనున్నట్లు ప్రకటించింది. పండుగల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని 22 రైళ్లను సెప్టెంబర్ 4 నుంచి అక్టోబర్ 10 వరకు నడిపించనున్నట్లు వివరించింది. సికింద్రాబాద్-తిరుపతి, కాచిగూడ-నాగర్‌సోల్, సంత్రగాచి-చర్లపల్లి మధ్య ఈ ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగిస్తాయని పేర్కొంది. సికింద్రాబాద్-తిరుపతి (07009) ప్రత్యేక రైలు సెప్టెంబర్ 4వ తేదీ నుంచి 25 వరకు ప్రతి గురువారం అందుబాటులో ఉంటుందని తెలిపింది.

తిరుపతి-సికింద్రాబాద్ (07010) మధ్య సెప్టెంబర్ 5వ తేదీ నుంచి 26 వరకు ప్రతి శుక్రవారం రాకపోకలు సాగిస్తుందని వివరించింది. ఇక కాచిగూడ-నాగర్‌సోల్ (07055) రైలు సెప్టెంబర్ 4 నుంచి 25 వరకు ప్రతి గురువారం, నాగర్‌సోల్-కాచిగూడ (07056) రైలు సెప్టెంబర్ 5 నుంచి 26 వరకు వరకు ప్రతి శుక్రవారం అందుబాటులో ఉంటుందని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. అలాగే, సంత్రగాచి-చర్లపల్లి (08845) రైలు సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 3 వరకు ప్రతి శుక్రవారం.. సంత్రగాచి (08846) రైలు సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 4 వరకు రాకపోకలు సాగిస్తుందని వివరించింది.

# భార్యలను హత్య చేసి శవాలను మాయం చేస్తున్న భర్తలు

## -సాక్ష్యాలు దొరకకుండా ఎత్తులు
## -కలకలం సృష్టిస్తున్న వరుస ఘటనలు
## -మీర్‌పేట్ ఘటన మరువక ముందే భ్రాంతికి గురిచేసిన మేడిపల్లి ఘటన

హైదరాబాద్, ఆగష్టు 25:"ఈ ఏడాది అందరూ సంక్రాంతి పండుగ చేసుకుంటున్నారు. మీర్‌పేట్‌లో మాత్రం మాధవి అనే వివాహిత అత్యంత దారుణంగా హత్యకు గురైంది. గురుమూర్తి అనే రిటైర్డు ఆర్మీ



ఉద్యోగి ఆమెను చంపి శరీరాన్ని ముక్కలు ముక్కలుగా చేసి ఉడకబెట్టాడు.. ఆమె శరీర భాగాల అనవాళ్లు లేకుండా కొన్ని చెరువులో పడేశాడు.

మరికొన్ని భాగాలను ఉడికించి మెత్తగా చేసి బాత్‌రూంలో పారపోశాడు.. ఆ తరువాత ఆమె కన్పించడం లేదంటూ భార్య కుటుంబ సభ్యులతో కలిసి మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని వ్యవహారంపై అనుమానం వచ్చిన మాధవి కుటుంబ సభ్యులు పోలీసుల వద్ద పలు సందేహాలు వ్యక్తంచేశారు.. దీంతో భర్తే ఏదో చేశాడనే అనుమానంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేయడంతో అసలు విషయం బయటకు వచ్చింది. సాంకేతిక పరిజ్ఞానంతో మాధవిని హత్య చేసిన ఆ ఇంట్లో రక్తపునమునాలను సేకరించి, మాధవిని హతమార్చినట్లు ఆధారాలు సేకరించిన పోలీసులు గురుమూర్తిని అరెస్ట్ చేశారు"

" ఇటీవల డిల్లీలో ఫాతిమా(30) అనే మహిళను ఆమె భర్త షహబాబ్ అలీ కిరాతంగా హత్య చేశాడు. ఆమె మృతదేహం లభించకుండా ఉండేలా మృతదేహాన్ని శ్మశాన వాటికలో తన స్నేహితుల సహకారంతో పాతిపెట్టాడు. ఆమె ఎవరితోనో లేచిపోయిందని కట్టుకథ అల్లి తప్పించుకునేందుకు ప్రయత్నించగా సీసీ కెమెరాల ద్వారా భర్తే హంతకుడనే విషయాన్ని పోలీసులు ధ్రువపరిచారు. ఫాతిమాను హత్య చేసేందుకు గత కొన్ని రోజులుగానే అతను ఎత్తులు వేశాడు.ఇందులో భాగంగా ఆమెకు మత్తుతో కూడిన మందులు ఇస్తూ ఆమెను నిస్సహాయ స్థితికి తెచ్చి హతమార్చాడు" నిందితుడు.

**చట్టానికి దొరకకుండా ..**

భార్యను చంపిన అనవాళ్లు లేకుండా చేయాలని ఈ రెండు ఘటనలలో నేరస్తులైన భర్తలు ప్రయత్నించారు. అలాంటిదే తాజాగా మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. గతంలో జరిగిన ఘటనలు.. సోషల్‌మీడియా.. హర్రర్ మూవీస్.. క్రైమ్ సీరిస్‌లతో పాటు పరోక్షంగా కుటుంబ సభ్యుల సహకారంతో కొందరు మృగాలుగా మారుతున్నారు. కట్టుకున్న భార్యలను కిరాతంగా హతమారుస్తున్నారు. చట్టానికి దొరకకుండా ఉండేలా.. శరీరాన్ని ముక్కలుగా చేసి అనవాళ్లు దొరకకుండా చేస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి.

తాజాగా మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న వికారాబాద్ జిల్లా కామారెడ్డిగూడ గ్రామానికి చెందిన సామల మహేందర్‌రెడ్డి (27), స్వాతి(21) అలియాస్ జ్యోతిలు ప్రేమించి పెండ్లి చేసుకున్నారు. పెండ్లి చేసుకున్నప్పటి నుంచే ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. స్వాతి కుటుంబానికి పెళ్లి ఇష్టం లేకున్నా, మహేందర్‌రెడ్డి కుటుంబమే ఈ ఇద్దరికి కులంతర వివాహం చేయడంలో కీలకంగా వ్యవహరించినట్లు చర్చించుకుంటున్నారు. ప్రేమించిన అమ్మాయితో జీవితాంతం సుఖ సంతోషాలతో ఉండాల్సిన వారు, పెండ్లి చేసుకోగానే ఇరువురి మధ్య గొడవలు మొదలయ్యాయి.

ఆ గొడవలు చినికి చినికి గాలివానలా మారుతూ పోలీస్‌స్టేషన్‌లో కేసుల వరకు కూడా వెళ్లాయి. ప్రేమించి పెండ్లి చేసుకున్న ఇద్దరూ గొడవ పడుతుండడంతో పెద్దలు అందరు మహేందర్, స్వాతిలను సముదాయించారు, ఇరు కుటుంబాలను కూడా సముదాయించి కేసు రాజీ కుదుర్చారు. డిగ్రీ చదివిన స్వాతి పంజాగుట్టలో కాల్ సెంటర్‌లో పనిచేస్తుండగా వృత్తిరీత్యా ఆమె ఫోన్‌లో మాట్లాటాల్సిన పరిస్థితి ఉండేది. దానిని కూడా మహేందర్ జీర్ణించుకోలేకపోయాడు, అక్కడ కూడా అనుమాన పడుతూ ఆమెతో గొడవలు పెట్టుకునేవాడు.

క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తూ మహేందర్ కుటుంబానికి స్వాతి ఉద్యోగం చేయడంతో సహాయంగా ఉంటుందనుకున్నారు, కాని అనుమానంతో ఆమెను ఉద్యోగం నుంచి కూడా మానిపించేశాడు. గర్భవతి అయిన ఆమెను జాగ్రత్తగా చూసుకోవాల్సిన మహేందర్, అతని కుటుంబ సభ్యులు ఆ విషయానే మర్చిపోయారు. ఆమెనే స్వయంగా దవాఖానకు వెళ్లాలని భావించినా దానికి కూడా అడ్డుకట్ట వేస్తూ మహేందర్ గొడవకు దిగేవాడు. గొడవలు, కులాంతర వివాహం, అనుమానం అన్ని కలిశాయి. దీనికి తోడు కుటుంబ సభ్యులు కూడా అప్పుడప్పుడూ ఎత్తిపొడుస్తూ మాట్లాడేవారని స్థానికంగా మాట్లాడుకుంటున్నారు.

**హత్య చేసి దొరకకుండా ప్లాన్!**

హత్య చేసి మృతదేహం దొరకకుండా చేస్తే చట్టానికి దొరకకుండా ఉండొచ్చని మహేందర్ భావించినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే గర్భవతి అయిన భార్యను చంపేందుకు ప్రణాళిక రచించాడు. యాక్సా బ్లేడ్లు కొని ఇంటికి వెళ్లాడు. ఎలాగైనే స్వాతిని వదిలించుకోవాలని అనుకొని శనివారం తన ప్లాన్‌ను అమలు చేశాడు. హత్య చేసి ఆమె శరీరాన్ని ముక్కలు ముక్కలుగా కోసేశాడు. గర్భంతో ఉన్న ఆమె మొండెం మాత్రం ఇంట్లోనే ఉండిపోయింది. ఇంట్లో నుంచి మూసీ వరకు మూడు సార్లు వెళ్లి తల, కాళ్లు, చేతులు పడేసి వచ్చాడు. ఇంట్లో నుంచి బయటకు శరీర భాగాలను పడేసేందుకు వెళ్తున్న సీసీ కెమెరాల దృశ్యాలను పోలీసులు సేకరించారు.

**పోలీసులు ఇంటికి రారనే..!**

తన భార్య కనిపించడం లేదని సోదరికి ఫోన్ చేయడం, వాళ్లంతా హుటాహుటిన ఉప్పల్‌కు రావడం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులకు తన భార్య కన్పించడం లేదని ఫిర్యాదు చేస్తే అక్కడక్కడా, ఊరికి వెళ్లి వెతుకుతారని భావించి ఉంటాడని, పోలీసులు ఫిర్యాదు ఇచ్చిన తరువాత ఇంటికి వచ్చి ఇంటిని పరిశీలిస్తారని మహేందర్‌రెడ్డి ఉహించలేదని పోలీసులు పేర్కొంటున్నారు. పోలీసులకు ఫిర్యాదు ఇచ్చి వెళ్లి, ఇంట్లో ఉన్న మొండాన్ని కూడా మాయం చేసేందుకు మహేందర్ స్కెచ్ వేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ విషయాలు దర్యాప్తులో వెల్లడవుతాయని పోలీసులు పేర్కొంటున్నారు. మొండానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం, డీఎన్ఏ పరీక్షలు కూడా పోలీసులు చేయనున్నారు.

**భర్తల కిరాతక హత్యలు..**

భార్యలను కిరాతంగా చంపుతున్న ఘటనలు సమాజంలో ఆందోళన కలిగిస్తున్నాయి. భార్యతో కలిసి ఉండడం ఇష్టం లేకుంటే చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలి కాని, హత్యలు చేసి, మృతదేహాలను మాయం చేసే పరిస్థితి వరకు ఎందుకు వస్తుందంటూ ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఉన్మాదిలా మారుతూ భార్యలను కిరాతంగా చంపుతున్న ఘటనల వెనుక ఇంటర్‌నెట్ ప్రభావం కూడా ఉందని, అనుమానం కూడా పెనుభూతమవుతుందని పలువురు పేర్కొంటున్నారు.

## బీసీలకు 42% రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయకపోతే

# రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

## -రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



హైదరాబాద్, ఆగష్టు 25:సోమవారం నాడు ఒక రోజు సత్యాగ్రహ దీక్షను ఇంద్రాపార్క్ ధర్నాచౌక్ వద్ద చేపట్టారు. వేలాది బీసీ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువజనులు, విద్యార్థులు, న్యాయవాదులు సభకు తరలి వచ్చి తమ హక్కుల కోసం గళమెత్తారు. బీసీ వృత్తులను ప్రతిబింబించే పాటలు, బీసీ హక్కుల సాధన కోసం రచించిన గీతాలు ప్రజలను కట్టిపడేశాయి. బీసీ గాయకుల ప్రదర్శనలు సభలో ఉత్సాహాన్ని నింపాయి. బీసీల హక్కుల సాధన కోసం నిర్వహించిన ఈ 'ఒక రోజు బీసీ సత్యాగ్రహ దీక్ష' కేవలం కార్యక్రమంగాక, భవిష్యత్తులో మరింత పెద్ద ఉద్యమాలకు నాంది పలికింది. ఇది బీసీ సమాజ ఐక్యతకు చిహ్నంగా నిలిచింది. దీక్షకు సభాధ్యక్షుడిగా రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు వ్యవహరించగా, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వహించారు. ? ఆర్.కృష్ణయ్య ప్రసంగిస్తూ "గత 19 నెలలుగా బీసీ రిజర్వేషన్ల పేరుతో ప్రభుత్వం తప్పుడు విధానాలను అవలంబిస్తూ మోసం చేస్తోంది. రాజ్యాంగబద్ధమైన, 42% చట్టబద్ధ అమలు మార్గాల ద్వారానే రిజర్వేషన్లు సాధ్యమవుతాయి. చట్టబద్ధమైన, రాజ్యాంగ బద్ధమైన కమిషన్‌లు కాకుండా తాత్కాలికంగా నియమించిన కమిషన్ల సిఫారసులు చెల్లవు. న్యూఢిల్లీలో నిరసనలు చేయడం, పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్లు ఇవ్వడం కాలయాపన తప్ప అసలు పరిష్కారం కాదు. ఇప్పుడు పార్టీ తరపున 'బీ-ఫార్మ్' అంటూ కొత్త డ్రామాకు తెరలేపడం పట్ల నేను తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాను. ప్రధానమంత్రి బీసీలను అనీనిలవతీబివట :అ అంటూ తప్పుదారి పట్టించడం కూడా ఆమోదయోగ్యం కాదు. బీసీలకు 42% రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలయ్యేలా ప్రభుత్వం వెంటనే సిద్ధం కావాలి. లేకుంటే ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతం చేస్తాం" అని హెచ్చరించారు.

ఇతర రాజకీయ నేతల మద్దతు సేరికొండ మధుసూదనాచారి (శాసన మండలి విపక్ష నేత) "బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధ అమలు అంటే సామాజిక న్యాయం. దీన్ని సాధించడానికి ప్రతి పక్షం బీసీ సమాజంతో భుజానికిభుజం కలుపుతుంది." ఈటల రాజేందర్ (బీజేపీ ఎంపీ) "బీజేపీ ఎల్లప్పుడూ బీసీల పక్షమే. 42% చట్టబద్ధ అమలు జరిగే వరకు మేము వెనక్కి తగ్గము. ఇది కేవలం హక్కు మాత్రమే కాదు, చారిత్రక అవసరం." వి.వి. శ్రీనివాస్ గౌడ్ (మాజీ మంత్రి) "రేవంత్ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోంది. 42% రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలయ్యేలా చేయడం వరకు మా పోరాటం కొన సాగుతుంది. డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు ప్రసంగిస్తూ "ప్రస్తుత 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం రూపొందించిన బిల్లులు గవర్నర్ ఆమోదానికి పెండింగ్‌లో ఉన్నాయి. అదే సమయంలో ఆర్డినెన్స్‌పై స్పష్టత లేదు. SEEEPCసర్వే చట్టబద్ధత లేకుండా ప్లానింగ్ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. బుసాని కమిటీ చట్టబద్ధ పద్ధతిలో నియమించ బడలేదు. సుదర్శన్ రెడ్డి వర్కింగ్ గ్రూప్‌కు సరైన అధికారం, పరిమితి లేవు. అసెంబ్లీలో నివేదికలు టేబుల్ చేసి సమగ్రంగా చర్చ జరిపిన దాఖలాలే లేవు. బిల్లుల ఆమోదానికి అవసరమైన న్యాయపరమైన ప్రమాణాలను ప్రభుత్వం పాటించలేదు. ఆనవసర తప్పు విధానాలు మానుకొని వెంటనే చట్టబద్ధంగా 42% రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం ముందుకు రావాలని వకుళాభరణం డిమాండ్ చేశారు.

బీసీ రిజర్వేషన్ల వంటి అత్యంత ప్రాధాన్యత గల అంశంలో ప్రభుత్వం నిర్ణీతమైన న్యాయపరమైన మార్గాలను పక్కన పెట్టి, రాజకీయం, విమర్శలు, తాత్కాలిక ఆర్డినెన్స్‌లు అనే తీరులో వ్యవహరించడం బీసీ హక్కులకు సరైన రక్షణ కాదు. చట్టం మాత్రమే పునాది కావాలి.. వ్యతిరేకాలు కాదు." ఏకతాటిపైకి వచ్చిన బీసీ సమాజం సభలో పాల్గొన్న బీసీ సంఘాల ప్రతినిధులు ఏకస్వరంతో నినాదాలు చేశారు: "మా హక్కులు మా రిజర్వేషన్లు" "42% సాధించాలి వెంటనే చట్టబద్ధ అమలు చేయాలి" ఈ ఒక రోజు దీక్షకు ా:అ మోర్చా అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, డా.అరుణ్ యాదవ్, డా. దుడిమెట్ల బాలరాజ్ యాదవ్, రాజా రామ్ యాదవ్, చి.ఉపేంద్ర బార్కా కృష్ణ, అంజి, పిచ్చెట్టి మురళి కృష్ణ, రాజ్‌కుమార్, శ్రీనివాస్ యాదవ్, ప్రభు గౌడ్, నీల వెంకటేశ్, గొర్రెగె మల్లేష్, జిల్లపెల్లి అంజి, వేముల రామకృష్ణ, రాజేందర్, మణికంఠ రాజు, నేత అనంతయ్య, మోడీ రాందేవ్, పృథ్వీ గౌడ్, రాందేవ్ యాదవ్, రమాదేవి, సుగుణ, అనురాధ గౌడ్, ఆది మల్లేశం, పటేల్ భరత్, కోటేశ్వరి, లతా, లతా సింగ్, బాలస్వామి, లక్ష్మి, నిఖిల్ పటేల్, భాస్కర్ ప్రజాపతి, అరవింద్, ప్రీతం తదితరులు హాజరై సంఘీభావం తెలిపారు.

# బ్యాంకుల క్రెడిట్‌ను పెంచుతాం : ఆర్‌బీఐ సంజయ్ మల్హోత్రా

హైదరాబాద్, ఆగష్టు 25: భారతదేశ విదేశీక మారక ద్రవ్య నిల్వలు బలంగా ఉన్నాయని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. నెలలు వస్తువులను ఎగుమతి చేసేందుకు ఈ నిల్వలు సరిపోతాయన్నారు. ఆర్థిక వ్యవస్థకు ఇవి రక్షణగా ఉన్నాయని తెలిపారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఈఎఅఅఎ), ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఎఃం) సంయుక్తంగా ఆగష్టు 25, 26 తేదీల్లో ముంబయిలోని నారిమన్ పాయింట్‌లోని హోటల్ ట్రైడెంట్‌లో వార్షిక బ్యాంకింగ్ సమావేశం ఏర్పాటు చేశాయి. ఈ సదస్సులో ఆయన ఆర్‌బీఐ గవర్నర్ పాల్గొని మాట్లాడారు. సెంట్రల్ బ్యాంకు నియమాలు, నిబంధనలను సమీక్షించేందుకు రెగ్యులేటరీ రివ్యూ సెల్‌ను ఏర్పాటుపై మాట్లాడుతూ ప్రతిపాదిత సెల్ ప్రతి ఐదు-ఏడు సంవత్సరాలకోసారి అన్ని నిబంధనలను సమీక్షిస్తుందన్నారు.

ధరల్లో స్థిరత్వం, ఆర్థిక వృద్ధి లక్ష్యంతో సెంట్రల్ బ్యాంకు ద్రవ్య విధానాన్ని కొనసాగుతుందన్నారు. ఆర్థిక స్థిరత్వాన్ని బలోపేతం చేయడం కొనసాగిస్తామని.. ఇదే తమ ప్రాథమిక లక్ష్యమన్నారు. బ్యాంకు క్రెడిట్‌ను పెంచే చర్యలను ఆర్‌బీఐ పరిశీలిస్తోం దన్నారు. నియంత్రిత సంస్థలు కస్టమర్ల ప్రయోజనం కోసం టెక్నాలజీలో పెట్టుబడి పెట్టాలని ఆర్‌బీఐ ఆశిస్తుందన్నారు. ప్రపంచంలో అస్థిరంగా మారిన ఆర్థిక వాతావరణంపై స్పందిస్తూ.. మనం దాన్ని దాటి సరిహద్దులను విసర్తించాల్సి ఉందన్నారు.

బ్యాంకులు, కంపెనీలు కలిసి వచ్చి పెట్టుబడులు పెంచాలని కోరారు. దేశం అస్థిర ప్రపంచ ఆర్థిక వాతావరణం గుండా వెళుతోందన్నారు. అభివృద్ధి చెందుతున్న రంగాలతో సహా బ్యాంకు రుణాలను విస్తరించడానికి వంటి చర్యలను ఆర్‌బీఐ పరిశీలిస్తోందన్నారు. భారతదేశ ఆర్థిక మధ్యవర్తిత్వం, సామర్థ్యం, ప్రభావాన్ని మెరుగుపరచడానికి నియంత్రిత సంస్థలతో కలిసి పనిచేయడానికి తాను ఎదురుచూస్తున్నానని, ప్రయోజనాలు ప్రజలకు చేరేలా చూసుకోవాలని మల్హోత్రా పేర్కొన్నారు.

# కాల గమనాన్ని కూడా మార్చే శక్తి భారత్ సొంతం: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 25:ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన ఎకనమిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా సదస్సుకు హాజరైన ప్రముఖ అతిథులందరినీ ఆయన స్వాగతించారు. ఈ ఫోరం జరుగుతున్న సమయం "అత్యంత తగిన సమయం"గా పేర్కొన్న శ్రీ నరేంద్ర మోదీ.. తగిన సమయంలో ఈ సదస్సును నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. గత వారం తాను ఎర్రకోట వేదికగా తదుపరి తరం సంస్కరణల గురించి మాట్లాడినట్లు గుర్తుచేసిన ప్రధానమంత్రి.. ఇప్పుడు ఆ స్ఫూర్తిని ఈ సదస్సు మరింత శక్తిమంతం చేస్తోందన్నారు.

ప్రపంచ పరిస్థితులు.. భౌగోళిక -ఆర్థిక అంశాలపై ఈ వేదికలో విస్తృత చర్చలు జరిగాయన్న ప్రధానమంత్రి.. ప్రపంచస్థాయి కోణంలో చూసినప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ బలాన్ని తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఉందనీ.. త్వరలోనే ప్రపంచ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ వృద్ధికి భారత్ అందిస్తున్న సహకారం సమీప భవిష్యత్తులో దాదాపు 20 శాతానికి చేరుకుంటుందన్న నిపుణుల అంచనాలను శ్రీ నరేంద్ర మోదీ ఈ సందర్భంగా ఉటంకించారు. గత దశాబ్దంలో సాధించిన స్థూల ఆర్థిక స్థిరత్వానికి భారత వృద్ధి.. ఆర్థిక సుస్థిరతే కారణమని ఆయన పేర్కొన్నారు. కోవిడ్-19 మహమ్మారి వంటి తీవ్రమైన సవాళ్లు ఉన్నప్పటికీ భారత ఆర్థిక లోటులో 4.4 శాతం తగ్గుదలను అంచనా వేసినట్లు ప్రధానమంత్రి తెలిపారు. భారతీయ కంపెనీలు మూలధన మార్కెట్ల నుంచి రికార్డు స్థాయిలో నిధులను సేకరిస్తున్నాయనీ.. భారతీయ బ్యాంకులు గతంలో కంటే బలంగా ఉన్నాయని.. అలాగే ద్రవ్యోల్బణం చాలా తక్కువగా ఉందని.. వడ్డీ రేట్లు కూడా తక్కువగా ఉన్నాయని ఆయన వివరించారు. భారత కరెంట్ ఖాతా లోటు నియంత్రణలో ఉందని, ఫారెక్స్ నిల్వలూ బలంగా ఉన్నాయని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. ప్రతి నెలా లక్షలాది దేశీయ పెట్టుబడిదారులు క్రమానుగత పెట్టుబడి ప్రణాళికల (ఎస్ఐపీల) ద్వారా మార్కెట్‌లో వేల కోట్ల రూపాయలు పెట్టుబడి పెడుతున్నారని పేర్కొన్నారు.

ఆర్థిక వ్యవస్థ పునాదులు బలంగా ఉన్నప్పుడే దాని ప్రభావం అన్ని రంగాలపై కనిపిస్తుందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో తాను దీని గురించి వివరంగా చర్చించానన్న ప్రధానమంత్రి.. ఆ అంశాలను పునరావృతం చేయకపోయినా, స్వాతంత్ర్య దినోత్సవం తర్వాత జరిగిన పరిణామాలు భారత వృద్ధి తీరును వివరిస్తున్నాయని పేర్కొన్నారు. తాజా డేటా ప్రకారం ఈ ఏడాది ఒక జూన్ నెలలోనే ఈపీఎఫ్ఓ డేటాబేస్‌లో అత్యధికంగా 22 లక్షల ఉద్యోగాలు అధికారికంగా నమోదయ్యాయని తెలిపారు. 2017 తర్వాత భారత రిటైల్ ద్రవ్యోల్బణం అత్యల్ప స్థాయిలో ఉందని.. భారత విదేశీ మారక నిల్వలు ఎప్పుడూ లేనంత గరిష్ట స్థాయికి చేరుకున్నాయని ఆయన పేర్కొన్నారు. 2014లో భారతదేశ సోలార్ పీవీ మాడ్యూల్ తయారీ సామర్థ్యం సుమారు 2.5 గిగావాట్లుగా ఉండగా.. తాజా గణాంకాల ప్రకారం ఈ సామర్థ్యం ఇప్పుడు 100 గిగావాట్లకు చేరిందన్నారు. ఢిల్లీ విమానాశ్రయం ప్రపంచ విమానాశ్రయాల ఎలైట్ హండ్రెడ్-మిలియన్-ప్లస్ క్లబ్‌లో చేరడంతో పాటు దాని వార్షిక ప్రయాణికుల నిర్వహణ సామర్థ్యం ఇప్పుడు 100 మిలియన్లను దాటిందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఈ ప్రత్యేక సమూహంలో ఉన్న ఆరు విమానాశ్రయాల్లో ఢిల్లీ విమానాశ్రయం ఒకటని ప్రధానమంత్రి వివరించారు.

ఇటీవల ఎస్ అండ్ పి గ్లోబల్ రేటింగ్స్ భారత క్రెడిట్ రేటింగ్‌ను అప్‌గ్రేడ్ చేసిన విషయాన్ని ప్రధానంగా ప్రస్తావించిన శ్రీ నరేంద్ర మోదీ.. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఇది సాధ్యమైందన్నారు. "భారత్ తన అద్భుత సామర్థ్యం.. బలం ద్వారా ప్రపంచ విశ్వాసానికి మూలంగా కొనసాగుతోంది" అని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.

అవకాశాలను అందిపుచ్చుకోనప్పుడు అవి ఎలా చేదాటిపోతాయో వివరించే "బస్సు అందుకోలేని" ఉదాహరణను ప్రస్తావిస్తూ.. దేశంలోని మునుపటి ప్రభుత్వాలు సాంకేతికత, పారిశ్రామిక రంగాల్లో అనేక అవకాశాలను చేజేతులా వదులుకున్నాయని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. తాను ఎవరినీ విమర్శించడం లేదనీ.. ప్రజాస్వామ్యంలో తులనాత్మక విశ్లేషణ తరచుగా పరిస్థితిని మరింత సమర్థంగా స్పష్టం చేయడానికి సహాయపడుతుందన్నారు.

గత ప్రభుత్వాలు దేశాన్ని ఓటు బ్యాంకు రాజకీయాలతో అస్తవ్యస్తంగా మార్చాయని.. ఎన్నికలకు మించి ఆలోచించే దృక్పథం వారికి లేదని ప్రధానమంత్రి విమర్శించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం అభివృద్ధి చెందిన దేశాలకే సాధ్యమని వారు భావించారనీ.. అవసరమైనప్పుడు దానిని దిగుమతి చేసుకోవచ్చనే నమ్మకంతో ఆ ప్రభుత్వాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఈ మనస్తత్వం కారణంగానే భారత్ అనేక దేశాల కంటే సంవత్సరాలుగా వెనుకబడిందన్నారు. పదే పదే కీలకమైన అవకాశాలను కోల్పోయిన క్రమంలో అభివృద్ధి బస్సును వారు అందుకోలేకపోయారన్న శ్రీ నరేంద్ర మోదీ... కమ్యూనికేషన్ రంగాన్ని ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ యుగం ప్రారంభమైన సమయంలో నాటి ప్రభుత్వం అనిశ్చితంగా ఉందన్నారు. 2జీ యుగంలో జరిగిన సంఘటనలు అందరికీ తెలిసినవేనని, భారత్ ఆ బస్సును కూడా నాడు అందుకోలేకపోయిందని ఆయన వ్యాఖ్యానించారు. 2జీ, 3జీ, 4జీ సాంకేతికతల కోసం భారత్ ఇతర దేశాలపై ఆధారపడేదని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితి ఎంతకాలం కొనసాగగలదని ప్రధానమంత్రి ప్రశ్నించారు. 2014 తర్వాత భారత్ తన విధానాన్ని పూర్తిగా మార్చుకుని బస్సును అందుకోవడం కాకుండా.. ఏకంగా బస్సును నడిపే స్థానం తీసుకొని ముందుకు సాగాలని నిర్ణయించుకుందని ఆయన స్పష్టం చేశారు. భారత్ తన మొత్తం 5జీ స్టాక్‌ను దేశీయంగానే అభివృద్ధి చేసిందని ప్రకటించిన శ్రీ నరేంద్ర మోదీ.. మేడ్-ఇన్-ఇండియా 5జీని రూపొందించడమే కాకుండా దానిని దేశవ్యాప్తంగా అత్యంత వేగంగా అమలు చేసిందని తెలిపారు. "భారత్ ఇప్పుడు మేడ్-ఇన్-ఇండియా 6జీ సాంకేతికత దిశగా కృషి చేస్తోంది" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

50-60 సంవత్సరాల కిందటే సెమీ కండక్టర్ల తయారీని భారత్ ప్రారంభించాల్సి ఉండగా.. ఆ బస్సును కూడా అప్పుడు అందుకోలేకపోయారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. చాలా సంవత్సరాలు అదే పరిస్థితి కొనసాగిందని ఆయన వ్యాఖ్యానించారు. పరిస్థితి ఇప్పుడు మారిందనీ, దేశంలో సెమీ కండక్టర్ల సంబంధిత కర్మాగారాలు రావడం ప్రారంభమైందని ఆయన తెలిపారు. ఈ సంవత్సరం చివరి నాటికి మొదటి మేడ్-ఇన్-ఇండియా చిప్ మార్కెట్లో అందుబాటులోకి వస్తుందని ప్రధానమంత్రి ప్రకటించారు.

జాతీయ అంతరిక్ష దినోత్సవ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ.. భారత అంతరిక్ష రంగంలో జరిగిన పరిణామాలను ప్రస్తావించారు. 2014కి ముందు భారత అంతరిక్ష మిషన్ల సంఖ్య, పరిధి పరిమితంగా ఉండేవని ప్రధానమంత్రి పేర్కొన్నారు. 21వ శతాబ్దంలో పెద్ద దేశాలు అంతరిక్ష అవకాశాలను అందిపుచ్చుకుంటున్న తరుణంలో భారత్ వెనుకబడి ఉండలేకపోయిందని పేర్కొన్నారు. అంతరిక్ష రంగంలో సంస్కరణలను ప్రవేశపెట్టడం.. ప్రైవేట్ రంగ భాగస్వామ్యానికి అనుమతించడం వంటి చర్యలు చేపట్టినట్లు శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. 1979 నుంచి 2014 వరకు భారత్ 35 సంవత్సరాల్లో కేవలం 42 అంతరిక్ష మిషన్లు మాత్రమే నిర్వహించిందని ఆయన వివరించారు. గత పదకొండు సంవత్సరాల్లో భారత్ 60కి పైగా మిషన్లను పూర్తి చేసిందని ఆయన గర్వంగా పేర్కొన్నారు. రాబోయే కాలంలో చేపట్టనున్న అనేక మిషన్లు వరుసలో ఉన్నాయని ప్రధానమంత్రి తెలిపారు. ఈ సంవత్సరం భారత్ స్పేస్ డాకింగ్ సామర్థ్యాన్ని సాధించిందనీ, భవిష్యత్ మిషన్ల కోసం ఇది కీలకం కానుందని ఆయన ప్రకటించారు. గగన్‌యాన్ మిషన్ కింద భారత్ తన వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపడానికి సిద్ధమవుతోందని, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా అనుభవం ఈ ప్రయత్నంలో గొప్ప సహాయకారిగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

"అంతరిక్ష రంగానికి కొత్త శక్తిని అందించడం కోసం దానిని అన్ని అడ్డంకుల నుంచి విముక్తి చేయడం చాలా అవసరం" అని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం కోసం మొదటిసారిగా స్పష్టమైన నియమాలు రూపొందించామన్నారు. ఈ రంగంలో విదేశీ పెట్టుబడులను మొదటిసారిగా సరళీకరించడంతో పాటు స్పెక్ట్రమ్ కేటాయింపును తొలిసారిగా పారదర్శకంగా పూర్తి చేసినట్లు ప్రధానమంత్రి తెలిపారు. ఈ సంవత్సరం బడ్జెట్‌లో అంతరిక్ష రంగ అంకుర సంస్థల కోసం ప్రత్యేకంగా రూ 1,000 కోట్ల వెంచర్ మూలధనాన్ని అందించినట్లు ఆయన ప్రకటించారు.

"చేపట్టిన సంస్కరణల విజయాన్ని భారత అంతరిక్ష రంగం ఇప్పుడు చూస్తోంది. 2014లో దేశంలో ఒకే ఒక అంతరిక్ష రంగ అంకురసంస్థ ఉండగా.. నేడు వాటి సంఖ్య 300కి పైగా ఉంది" అని ప్రధానమంత్రి వివరించారు. కక్ష్యలో భారత్ తన సొంత అంతరిక్ష కేంద్రాన్ని కలిగి ఉండే రోజు ఎంతో దూరంలో లేదన్నారు.

"ఒక్కో అడుగేస్తూ నిదానంగా సాధించే మార్పు భారత లక్ష్యం కాదు.. అత్యంత వేగంగా దూసుకెళ్తూ మార్పును సాధించాలనే లక్ష్యంతో దేశం ముందుకు సాగుతోంది" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. దేశంలో సంస్కరణలు తప్పనిసరి పరిస్థితులు.. సంక్షోభాల నివారణ కోసం చేపడుతున్నవి కాదని ఆయన పేర్కొన్నారు. భారత్ నిబద్ధత, దృఢ నిశ్చయానికి మన సంస్కరణలు ప్రతిబింబించాలని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతీ రంగం గురించి విడిగా లోతైన సమీక్షలు నిర్వహించడం ద్వారా ప్రభుత్వం సమగ్ర విధానాన్ని అవలంబిస్తుందన్న శ్రీ నరేంద్ర మోదీ.. ఆయా రంగాల్లో సంస్కరణలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

ఇటీవల ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సంస్కరణల కొనసాగింపును ప్రతిబింబిస్తున్నాయన్న ప్రధానమంత్రి.. ప్రతిపక్షాలు అనేక ఆటంకాలు కలిగించినప్పటికీ ప్రభుత్వం సంస్కరణలను ముందుకు తీసుకెళ్లడానికి పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జన్ విశ్వాస్ 2.0 చొరవను విశ్వాసం ఆధారితమైన, ప్రజానుకూలమైన పరిపాలనకు సంబంధించిన ఒక ప్రధాన సంస్కరణగా ఆయన అభివర్ణించారు. జన్ విశ్వాస్ మొదటి ఎడిషన్ కింద దాదాపు 200 చిన్నపాటి నేరాలను నేరాల జాబితా నుంచి తొలగించామని గుర్తుచేశారు. రెండో ఎడిషన్‌లోనూ 300కి పైగా చిన్నపాటి నేరాలనూ తాజాగా నేరాల జాబితా నుంచి తొలగించామని ఆయన ప్రకటించారు. 60 సంవత్సరాలుగా మారకుండా ఉన్న ఆదాయపు పన్ను చట్టాన్ని కూడా ఈ సమావేశాల సందర్భంగా సంస్కరించామని, ఈ చట్టం ఇప్పుడు ఎంతో సరళీకృతం అయిందని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గతంలో చట్టంలోని భాష న్యాయవాదులు.. చార్టర్డ్ అకౌంటెంట్లు మాత్రమే సరిగ్గా అర్థం చేసుకోగలిగేలా ఉండేదన్న ప్రధానమంత్రి.. "ఇప్పుడు, ఆదాయపు పన్ను బిల్లు సాధారణ పన్ను చెల్లింపుదారులకు కూడా సులభంగా అర్థమయ్యే భాషలో రూపొందించాం. ఇది పౌరుల ప్రయోజనాల పట్ల ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తుంది" అని వ్యాఖ్యానించారు.

గనుల చట్టాల వంటి అనేక చట్టాలకు గణనీయ సవరణలు చేసిన ఇటీవలి వర్షాకాల సమావేశాల గురించి మాట్లాడుతూ.. వలసరాజ్యాల కాలం నాటి నౌకాయానం, ఓడరేవుల నియంత్రణ చట్టాలను కూడా ఈ సమావేశాల్లో సవరించామని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. ఈ సంస్కరణలు భారత జల ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయని.. నౌకాశ్రయ ఆధారిత అభివృద్ధిని ప్రోత్సహిస్తాయని ఆయన పేర్కొన్నారు. క్రీడా రంగంలో కూడా నూతన సంస్కరణలు ప్రవేశపెట్టామన్నారు. ప్రధాన అంతర్జాతీయ క్రీడా కార్యక్రమాల నిర్వహణకు భారత్ సిద్ధమవుతోందనీ.. సమగ్ర క్రీడా ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ దార్శనికతకు మద్దతుగా ప్రభుత్వం ఖేలో భారత్ నీతి పేరుతో నూతన జాతీయ క్రీడా విధానాన్ని ప్రారంభించినట్లు ప్రధానమంత్రి ప్రకటించారు.

"ఇప్పటికే సాధించిన లక్ష్యాలతో సంతృప్తి చెందడం నా స్వభావం కాదు. సంస్కరణలకు కూడా ఇదే విధానం వర్తిస్తుంది. మా ప్రభుత్వం ఈ మార్గంలో మరింత ముందుకు సాగాలని నిశ్చయించుకుంది" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. సంస్కరణల ఆయుధాలను సమగ్రంగా సిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి బహుళ రంగాల్లో కృషి జరుగుతోందన్నారు. అనవసరమైన చట్టాలను రద్దు చేయడం, నిబంధనలు.. విధానాలను సరళీకరించడం వంటి కీలక చర్యలను ప్రధానమంత్రి వివరించారు. విధానాలు, ఆమోదాలను డిజిటలైజ్ చేస్తున్నామనీ, అనేక నిబంధనలను నేరరహితం చేస్తున్నామని ఆయన వివరించారు. "జీఎస్టీ విధానంలో ఒక పెద్ద సంస్కరణ చేపట్టనున్నాం.. ఈ ప్రక్రియ దీపావళి నాటికి పూర్తవుతుంది" అని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. దీని ద్వారా జీఎస్టీ వ్యవస్థ మరింత సరళతరం అవుతుందనీ, ధరలు కూడా తగ్గుతాయని ప్రకటించారు.

ఈ తదుపరి తరం సంస్కరణలు అనే ఆయుధాలు దేశం అంతటా తయారీలో పెరుగుదలకు దారితీస్తాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. మార్కెట్ డిమాండు పెరుగుతోందనీ.. పరిశ్రమలు కొత్త శక్తిని పొందుతాయని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సంస్కరణల ఫలితంగా జీవన సౌలభ్యం.. వ్యాపార సౌలభ్యం రెండూ మెరుగుపడతాయని ధ్రువీకరిస్తూ, కొత్త ఉపాధి అవకాశాలూ అందుబాటులోకి వస్తాయని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు.

2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి పూర్తిగా కట్టుబడి ఉందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. స్వయంసమృద్ధ భారత్.. అభివృద్ధి చెందిన భారత్ కోసం పునాది అవుతుందని వ్యాఖ్యానించారు. ఆత్మనిర్భర్ భారత్‌ను వేగం, స్థాయి, పరిధి అనే మూడు కీలక పారామితుల ఆధారంగా అంచనా వేయాలన్నారు. మహమ్మారి సమయంలో భారత్ ఈ వేగం, స్థాయి, పరిధి అనే మూడింటినీ ప్రదర్శించిందని గుర్తుచేసుకుంటూ.. అవసరమైన వస్తువులకు డిమాండ్ అకస్మాత్తుగా పెరిగిన తీరును, ప్రపంచ సరఫరా వ్యవస్థ నిలిచిపోయిన విధానాన్ని శ్రీ నరేంద్ర మోదీ ప్రస్తావించారు. అవసరమైన వస్తువులను దేశీయంగా తయారు చేయడానికి భారత్ నిర్ణయాత్మక చర్యలు తీసుకుందని ఆయన పేర్కొన్నారు. భారత్ అత్యంత వేగంగా పెద్ద మొత్తంలో పరీక్షా కిట్లు, వెంటిలేటర్లను ఉత్పత్తి చేసిందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఆసుపత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన విషయాన్ని ప్రధానమంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. ఇది భారత్ వేగాన్ని సూచిస్తోందన్నారు. దేశంలోని ప్రతి మూలలో పౌరులకు భారత్‌లో తయారైన 220 కోట్లకు పైగా టీకాలను ఉచితంగా అందించడం భారత స్థాయిని తెలియజెప్పిందని పేర్కొన్నారు. లక్షలాది మందికి వేగంగా టీకాలు అందించడం కోసం భారత్ కోవిన్ వేదికను అభివృద్ధి చేసిందని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. ఇది భారత పరిధిని ప్రతిబింబించిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఒక ప్రత్యేక వ్యవస్థ అయిన కో-విన్ కారణంగానే భారత్ తన టీకా డ్రైవ్‌ను రికార్డు సమయంలో పూర్తి చేయగలిగిందని ఆయన ధ్రువీకరించారు.

ఇంధన రంగంలోనూ భారత్ వేగం, స్థాయి, పరిధిని ప్రపంచమంతా చూస్తోందనీ, 2030 నాటికి తన మొత్తం విద్యుత్ సామర్థ్యంలో 50 శాతం శిలాజేతర ఇంధనాల ద్వారా ఉత్పత్తి చేయడమే భారత్ లక్ష్యమని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. 2025లోనే అంటే షెడ్యూల్ కంటే అయిదు సంవత్సరాల ముందుగానే ఈ లక్ష్యాన్ని సాధించామని ఆయన ప్రకటించారు.

గతంలోని విధానాలు దిగుమతులపైనే ఎక్కువగా దృష్టి సారించాయని, స్వార్థ ప్రయోజనాలే ఇందుకు కారణమని ప్రధానమంత్రి విమర్శించారు. నేడు స్వావలంబన సాధించిన భారత్ ఎగుమతుల్లో కొత్త రికార్డులు సృష్టిస్తోందని ఆయన స్పష్టం చేశారు. గత సంవత్సరంలో భారత్ రూ. 4 లక్షల కోట్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసిందని ఆయన తెలిపారు. గత సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి చేసిన 800 కోట్ల టీకా డోసుల్లో 400 కోట్లు భారత్‌లోనే తయారయ్యాని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాతి ఆరున్నర దశాబ్దాల్లో భారత ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు దాదాపు రూ. 35,000 కోట్లకు చేరుకున్నాయని, అయితే నేడు ఎగుమతుల విలువ సుమారు రూ. 3.25 లక్షల కోట్లకు పెరిగిందని ఆయన పేర్కొన్నారు.

2014 వరకు భారత ఆటోమొబైల్ ఎగుమతులు సంవత్సరానికి సుమారు రూ. 50,000 కోట్లుగా ఉన్నాయన్న శ్రీ నరేంద్ర మోదీ.. నేడు ఒకే సంవత్సరంలో రూ. 1.2 లక్షల కోట్ల విలువైన ఆటోమొబైల్స్‌ను భారత్ ఎగుమతి చేస్తోందని స్పష్టం చేశారు. మెట్రో కోచ్‌లు, రైలు కోచ్‌లు, రైలింజన్లను కూడా భారత్ ఎగుమతి చేయడం ప్రారంభించిందని ఆయన వ్యాఖ్యానించారు. 100 దేశాలకు ఎలక్ట్రిక్ వాహనాలను ఎగుమతి చేయడం ద్వారా భారత్ మరో విజయాన్ని సాధించబోతోందని ప్రధానమంత్రి తెలిపారు. ఈ విజయానికి సంబంధించిన ఒక ప్రధాన కార్యక్రమం ఈనెల 26న జరుగుతుందని ఆయన ప్రకటించారు.

దేశ పురోగతికి పరిశోధన మూలస్తంభమని స్పష్టం చేసిన ప్రధానమంత్రి.. దిగుమతి చేసుకున్న పరిశోధనలు మనుగడకు సరిపోవచ్చు, కానీ అవి భారత ఆకాంక్షలను నెరవేర్చలేవని వ్యాఖ్యానించారు. పరిశోధన రంగంలో అత్యవసరత, కేంద్రీకృత దృక్పథం అవసరాన్ని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. పరిశోధనలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం వేగంగా కృషి చేస్తూ.. అవసరమైన విధానాలు, వేదికలను నిరంతరం అభివృద్ధి చేసిందని ఆయన పేర్కొన్నారు.

2014తో పోలిస్తే పరిశోధనాభివృద్ధిపై ఖర్చు రెట్టింపు కంటే ఎక్కువగా ఉందని, దాఖలు చేసిన పేటెంట్ల సంఖ్య 2014 నుంచి 17 రెట్లు పెరిగిందని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. సుమారు 6,000 ఉన్నత విద్యా సంస్థల్లో పరిశోధనాభివృద్ధి విభాగాలను స్థాపించామని ప్రధానమంత్రి ప్రకటించారు. 'ఒకే దేశం-ఒకే సబ్‌స్క్రిప్షన్' కార్యక్రమం ద్వారా ప్రపంచ పరిశోధన పత్రికలు మన విద్యార్థులకు మరింత అందుబాటులోకి వచ్చాయని ఆయన పేర్కొన్నారు. రూ. 50,000 కోట్ల బడ్జెట్‌తో జాతీయ పరిశోధన ఫౌండేషన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు రూ.1 లక్ష కోట్ల విలువైన పరిశోధన.. అభివృద్ధి.. ఆవిష్కరణ పథకాన్ని కూడా ఆమోదించామని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. ప్రైవేట్ రంగంలో ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న, వ్యూహాత్మక రంగాల్లో కొత్త పరిశోధనలకు మద్దతు ఇవ్వడం తమ లక్ష్యం అని ఆయన పేర్కొన్నారు.

